ఆదివారం
15-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 115
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆక్రమణే ఉగ్రవాదం

ఇజ్రాయిల్ దండయాత్ర క్రమంలో పలస్తీనాకు మద్దతు పెరుగుతోంది. కొన్ని చోట్ల ఇజ్రాయిల్‌కు మద్దతుగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. యుద్ధానికి నాంది పలికినది హమాస్ అని కొందరు నిందిస్తుంటే మరికొందరు ఇజ్రాయిల్ విచక్షణ కోల్పోయి వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. తాజాగా న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్, మ్యాన్‌హాటన్‌లో పలస్తీనాకు మద్దతుగా ప్రదర్శనలు జరిగాయి.

2 లో



'అదానీ' ముంబై విమానాశ్రయాలపై

దర్యాప్తు

న్యూఢిల్లీ: అదానీ గ్రూపుకు చెందిన ముంబైలోని రెండు విమానాశ్రయాలపై కార్పొరేట్ వ్యవహారాల శాఖ దర్యాప్తు చేపట్టింది. ఈ అంశాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీస్‌కు అదానీ గ్రూపు తెలియజేసింది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్ (ఎంఐఏఎల్), నవీముంబై అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్ (ఎన్ఎంఐఏఎల్)కు సంబంధించిన లావాదేవీలతో పాటు ఇతర సమాచారాన్ని దర్యాప్తు అధికారులు కోరినట్లు అదానీ గ్రూపు తెలిపింది. 2017-18, 2021-22 రికార్డులను అధికారులు కోరినట్లు వెల్లడించింది. 2021-22లో ఈ రెండు విమానాశ్రయాల అదానీ గ్రూపు సేకరించింది. కంపెనీల చట్టం,2013లోని సెక్షన్ 210(1) కింద ఖాతా పుస్తకాలు, ఇతర పత్రాల విచారణను చేపడుతున్నట్లు సంబంధిత యంత్రాంగం నుంచి ఎంఐఏఎల్, ఎన్ఎంఐఏఎల్‌కు సమాచారం అందినట్లు బీఎస్ఈ ఫైలింగ్‌లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. 2021 జులైలో ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో 74శాతం వాటాను అదానీ గ్రూపు సేకరించింది. అంతకుముందు జీవీకే గ్రూపులో 50.5శాతం, ఏసీఎస్ఏ గ్లోబల్ లిమిటెడ్, బిడ్ సర్వీసెస్ డివిజన్ (మారిషస్) లిమిటెడ్ (బిడ్‌వెస్ట్)లో 23.5శాతం చొప్పున వాటాలను కొనుగోలు చేసింది. నవీ ముంబై ఎయిర్‌పోర్టు నిర్వహణ హక్కులను పొందింది. 2024 డిసెంబరు నుంచి ఈ విమానాశ్రయంలో కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. దేశవ్యాప్తంగా ఏడు విమానాశ్రయాల నిర్వహణను అదానీ సంస్థ చూసుకుంటోంది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) కింద 2019 ఫిబ్రవరిలో ఆరు

- మిగతా 2 లో

కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల

బీజేపీని ఓడిద్దాం

- నవంబరు 26,27,28 తేదీల్లో 'మహాపడావ్'
- జయప్రదానికి కార్మిక, రైతు సంఘాల పిలుపు

న్యూఢిల్లీ: వచ్చేనెల 26,27,28 తేదీల్లో అన్ని రాష్ట్రాల రాజ్‌భవన్‌ల వద్ద 'మహా పడావ్'ను జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూలు), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఐక్యవేదిక పిలుపునిచ్చింది. పోస్టర్లు, జాతాలు, సభలు, కరపత్రాల పంపిణీ ద్వారా మహాపడావ్‌ను జయప్రదం చేయాలని నిర్ణయించింది. లఖింపూర్ ఖేరి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబరు 3న దేశవ్యాప్తంగా వెయ్యికిపైగా కేంద్రాల్లో బ్లాక్‌డే నిర్వహించిన శ్రేణులకు అభినందనలు తెలిపింది. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, కార్మికుల, రైతుల వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. స్వీయ సమృద్ధి నెపంతో రైతులకు, కార్మికులకు ఇబ్బంది కలిగే పద్ధతులను సర్కార్ అనుసరిస్తోందని ఐక్య వేదిక దుయ్యబట్టింది. ఎస్‌కేఎం, సీటీయూలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఏకపక్షంగా విద్యుత్(సవరణ) బిల్లు, 2022ని కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేసింది. 41 రక్షణ కర్మాగారాలను ఏడు కార్పొరేషన్లుగా మార్చిందని, మూడింటి విలీలానికి సిద్ధమైందని పేర్కొంది. బొగ్గు పరిశ్రమలో వేతనాల పోరును గుర్తుచేసింది. కొత్త పింఛన్ పథకం రద్దు, పాత పింఛన్ పథకం

- మిగతా 2 లో

ఇక ప్రత్యక్ష యుద్ధమే

- విదేశీయుల తరలింపునకు ఈజిప్టు, అమెరికాతో ఇజ్రాయిల్ ఒప్పందం
- యూదు దేశంతో సత్సంబంధాలపై సౌదీ వెనక్కి
- గాజాలో 1300 భవనాలు నేలమట్టం.. 2,215 మంది మృతి

-8లో

ప్రమాదంలో ఆర్థిక వ్యవస్థ

- దేశంలో మరింత క్షీణించిన విదేశీ మారకం నిల్వలు
- నెల రోజుల్లో 14 బిలియన్ డాలర్ల పైనే పతనం
- 584.74 బిలియన్ డాలర్లకు పరిమితం

న్యూఢిల్లీ : కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. అస్తవ్యస్త ఆర్థిక విధానాలను అమలు చేస్తూ ప్రజా వ్యతిరేక చర్యలకు పూనుకోవడం, పేదలు, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారాలు మోపడం వంటి నిరంకుశ, నిర్లక్ష్య పాలనను కొనసాగిస్తోంది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ కుంటుపడింది. ఇప్పుడు దేశంలోని విదేశీ మారకం నిల్వలు అంతకంతకూ పడిపోతున్నాయి. కేవలం నెల రోజుల్లో 14 బిలియన్ డాలర్లకు పైగా హరించుకుపోవడం అత్యంత ఆందోళనకరంగా తయారైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వివరాల ప్రకారం సెప్టెంబరు 1న 598.897 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతీయ ఫారెక్స్ నిల్వలు... ఈ నెల 6 నాటికి 584.742 బిలియన్ డాలర్లకు దిగజారాయి. దీంతో 14.155 బిలియన్ డాలర్లు క్షీణించినట్లయింది. ఈ నెల 6తో ముగిసిన వారంలో 2.166 బిలియన్ డాలర్లు పతనమైనట్టు శుక్రవారం ఆర్‌బీఐ తాజా గణాంకాల్లో తేలింది. ఇక గత నెలలో ఒక్క తొలి వారంలోనే అత్యధికంగా సుమారు 5 బిలియన్ డాలర్ల మేర ఫారెక్స్ రిజర్వులు పడిపోవడం గమనార్హం. కాగా, 2021 అక్టోబరులో దేశ ఫారెక్స్ నిల్వలు 645 బిలియన్ డాలర్ల గరిష్ఠ స్థాయిని తాకాయి. దాంతో పోల్చితే ఈ రెండేళ్లలో 60 బిలియన్ డాలర్ల క్షీణతే కనిపిస్తోంది.

దేశీయ విదేశీ మారక నిల్వలు ఇలాగే పడిపోతే భారత ఆర్థిక వ్యవస్థకు ముప్పేనన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ఆర్‌బీఐ సమాచారం మేరకు వారం వారం డాలర్ నిల్వలు క్షీణిస్తున్న పరిస్థితే కనిపిస్తోంది. దీంతో ఈ నిల్వలు బలంగా ఉంటే ఆర్థిక వ్యవస్థకు ఎంత లాభమో.. బలహీనపడితే కూడా

- మిగతా 2 లో

యువత కలలు, ఆకాంక్షల హత్య

- ఉద్యోగ కల్పనలో కేసీఆర్ విఫలం
- టీఎస్‌పీఎస్‌సీ పునర్వ్యవస్థీకరిస్తాం
- ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలిస్తాం
- గ్రూప్ 2 అభ్యర్థి ఆత్మహత్యపై రాహుల్ కలత

విశాలాంధ్ర-హైదరాబాద్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ప్రవళిక ఆత్మహత్యపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. ఇది ఆత్మహత్య కాదని, యువత కలలు, ఆకాంక్షలను హత్య చేయడమేనని విమర్శించారు. కె.చంద్రశేఖరరావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంపై 'ఎక్స్' వేదికగా రాహుల్ శనివారం నిప్పులు చెరిగారు. ఈ పదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్ కారణంగా రాష్ట్రం పూర్తిగా వెనుకబడిపోయిందని రాహుల్ ఆరోపించారు. 'తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండరు విడుదల చేస్తుంది. నెలరోజుల్లోనే యూపీఎస్‌సీ తరహాలో టీఎస్‌పీఎస్‌సీని పునర్వ్యవస్థీకరిస్తాం. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఇదే మా హామీ' అని రాహుల్ పేర్కొన్నారు. ప్రవళిక ఆత్మహత్యపై కాంగ్రెస్

- మిగతా 2 లో

ఆత్మహత్య కాదు...

సర్కారీ హత్యే

సీపీఐ కార్యదర్శి నారాయణ

నిరుద్యోగ యువతి ప్రవల్లికది ఆత్మహత్య కాదని, అది సర్కారీ హత్యేనని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు.

2లో

టీమిండియా

ఆల్‌రౌండ్ షో

- ప్రపంచకప్‌లో పాక్‌పై ఘన విజయం
- రోహిత్ ధనాధన్ ఇన్నింగ్స్
- అర్ధసెంచరీతో అలరించిన శ్రేయాస్
- రాణించిన బౌలర్లు

ప్రపంచకప్‌లో మహాసంగ్రామం అనుకున్న దాయాదుల పోరు సాదాసీదాగా ముగిసింది. ఇక్కడి నరేంద్రమోదీ స్టేడియంలో శనివారం భారత్-పాక్ మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లో టీమిండియా7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. కేవలం 30.3 ఓవర్లలో 192 పరుగుల విజయలక్ష్యాన్ని ఊదేసింది.

-8లో

కృష్ణాజలాల పున:పంపిణీపై

18న కడపలో రాష్ట్ర సదస్సు

- తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసం కేంద్రం కుట్ర
- అదానీకి బీచ్‌శాండ్ మైనింగ్ అప్పగిస్తున్న జగన్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణా జలాల పున:పంపిణీపై కేంద్రప్రభుత్వం భారీ కుట్రకు తెరలేపిందని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధికోసమే ఈ అంశాన్ని భుజానకెత్తుకుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. 'కృష్ణా జలాల పున:పంపిణీపై కేంద్రం గెజిట్ నోటిఫికేషన్-ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు-సీమ ప్రాజెక్టులు' అంశంపై సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో అక్టోబరు 18వ తేదీన కడప వైఎస్సార్ ఆడిటోరియంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు రామకృష్ణ తెలిపారు. విజయవాడ దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినా బాధిత రాష్ట్రం మాత్రం ఆంధ్రప్రదేశేనని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసం కృష్ణా జలాల పున:పంపిణీపై మోదీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ సదస్సు నిర్వహిస్తున్నారని చెప్పారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 811 టీఎంసీల నీటిని ఏపీ, తెలంగాణకు కేటాయించారని, రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటిని కేటాయించారని గుర్తుచేశారు. ఆ నిర్ణయాన్ని తుంగలో తొక్కి ఏపీకి వస్తున్న నీటికి ఎసరు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



చంద్రబాబు ఆరోగ్యంపై హైటెన్షన్

- ములాఖత్ తర్వాత కుటుంబ సభ్యులు తీవ్ర భావోద్వేగం
- పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్న కాసాని జ్ఞానేశ్వర్
- వైద్యుల సూచనలు పాటించడం లేదంటూ లోకేశ్ ఆగ్రహం
- చంద్రబాబుకు ఏసీ పెట్టండి- ఏసీబీ కోర్టు ఆదేశం
- మళ్లీ హెల్త్ బులిటెన్ విడుదల చేసిన జైళ్ల శాఖాధికారులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దిల్లీ వెళ్లిన నారా లోకేశ్ శనివారం హుటాహుటిన రాజమహేంద్రవరం చేరుకోవడం, చంద్రబాబుతో ములాఖత్ అనంతరం భావోద్వేగానికి గురికావడం పార్టీ శ్రేణులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. లోకేశ్‌తో పాటు తల్లి భువనేశ్వరి, తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌లు చంద్రబాబుతో ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి క్షీణించడాన్ని

- మిగతా 2 లో

అర్థవంత శాంతి చర్చలేవి?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విపక్షాల ఆగ్రహం
- మణిపూర్ గవర్నరుకు వినతిపత్రం
- అడ్డుకున్న పోలీసులు... ఉద్రిక్తం

ఇంఫాల్: మణిపూర్ గవర్నరు అనసూయ యుకేకు వినతిపత్రం ఇవ్వడానికి వెళుతున్న పది ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. గవర్నరు బంగ్లాకు వెళ్లకుండా ప్రతిపక్ష నేతలను నిలిపివేశారు. దీంతో ఆందోళనకారులు, పోలీసులకు తోపులాట జరిగింది. అయితే ఆందోళన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు

- మిగతా 2 లో

ఇజ్రాయిల్ దాడుల్లో రాయిటర్స్ జర్నలిస్టు మృతి

మరికొందరికి గాయాలు

బీరుట్: దక్షిణ లెబనాన్‌లో విధి నిర్వహణలో ఉన్న రాయిటర్స్ జర్నలిస్టు మృత్యువాత పడ్డారు. ఇజ్రాయిల్ క్షిపణి దాడుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. అల్ జజీరా, ఏజెన్సే ఫ్రాన్సే ప్రెస్సెతో సహా కొన్ని వార్తాసంస్థల జర్నలిస్టులు ఇజ్రాయిల్ సరిహద్దుకు దగ్గరగా అల్మా అల్ సాబ్ వద్ద పనిచేస్తుండగా ఇజ్రాయిల్ వైపు నుంచి క్షిపణులు వచ్చి పడ్డాయి. ఈ జర్నలిస్టు ఇసామ్ అబ్దల్లా ప్రాణాలు కోల్పోగా మరికొందరు గాయపడ్డారు. ఓ వాహనం దగ్ధమైంది. ఈ మేరకు రాయిటర్స్ వెల్లడించింది. వీడియోగ్రాఫర్‌ను కోల్పోవడం కలిచివేసినట్లు పేర్కొంది. మరో ఇద్దరు రాయిటర్స్ జర్నలిస్టులు తాహెర్ అల్ సుదానీ, మహెర్ నాజేకు గాయాలు కాగా వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించింది. అసోసియేటెడ్ ప్రెస్, అల్ జజీరాతో పాటు మరికొన్ని వార్తా సంస్థల సిబ్బంది వార్తాసేకరణలో ఉన్న సమయంలో ఈ ఘటన చోటచేసుకోగా మీడియా సిబ్బందిలో కొందరికి గాయాలయ్యాయని, గాయపడిన వారిలో ఏజెన్సే ఫ్రాన్స్-ప్రెస్సె ఇద్దరు జర్నలిస్టులు ఉన్నట్లు తెలిసింది.

ఆక్రమణే ఉగ్రవాదం

పలస్తీనాకు మద్దతుగా న్యూయార్క్‌లో ర్యాలీ

పశ్చిమాసియా వ్యాప్తంగా అనుకూల, వ్యతిరేక ప్రదర్శనలు

న్యూయార్క్: ఇజ్రాయిల్ దండయాత్ర క్రమంలో పలస్తీనాకు మద్దతు పెరుగుతోంది. కొన్ని చోట్లు ఇజ్రాయిల్‌కు మద్దతుగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. యుద్ధానికి నాంది పలికినది హమాస్ అని కొందరు నిందిస్తుంటే మరికొందరు ఇజ్రాయిల్ విచక్షణ కోల్పోయి వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. తాజాగా న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్, మ్యాన్‌హాటన్‌లో పలస్తీనాకు మద్దతుగా ప్రదర్శనలు జరిగాయి. పారిస్ (ఫ్రాన్స్), వార్సవా (పోలాండ్)లో హమాస్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌కు మద్దతుగా ర్యాలీలు నిర్వహించారు. మొత్తంగా పశ్చిమాసియావ్యాప్తంగా భారీ ప్రదర్శనలు జరిగాయి. గాజాపై దాడులను తీవ్రతరం చేయడాన్ని ప్రదర్శనలు ఖండించాయి. ఫ్రాన్స్, జర్మనీతో పాటు పశ్చిమ దేశాల్లోని అనేక ప్రాంతాలతో పాటు ఇరాక్, లెబనాన్, ఇండోనేసియా, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, ఈజిప్టు, యూరప్‌లో పలస్తీనాకు మద్దతు తెలుపుతూ వేలాది సంఖ్యలో ప్రజలు కదం తొక్కారు. పలస్తీనా ప్రజలకు మద్దతుగా న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ వద్ద భారీ ర్యాలీ జరిగింది. పలస్తీనా జెండా చేబూని 'పలస్తీనాకు స్వేచ్ఛ', 'పలస్తీనాకు మద్దతిస్తాం', 'ఆక్రమణ అంటే ఉగ్రవాదం' అని నినదించారు. గాజాపై దాడులను తక్షణమే ఆపాలని, అమాయక ప్రజల మారణహోమానికి అంతం పలకాలని, ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. న్యూయార్క్‌లోని యూదులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బందోబస్తు పెంచారు. అల్-అద్వా న్యూయార్క్, అమెరికన్ ముస్లిమ్స్ ఫర్ పలస్తీనా అధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. న్యూయార్క్‌లోని పలస్తీనా ప్రజలపై దాడులు, హింస జరుగుతోందని, పలస్తీనాకు మద్దతు తెలుపుతున్నందున జీవనోపాధిని కోల్పోవల్సి వస్తోందని ప్రదర్శనకారుల్లో కొందరు చెప్పారు. 80 ఏళ్ల కిందట మమ్మల్ని నిర్వాసితులుగా మార్చిన పర్యవసానగంగా పలస్తీనా ప్రజలు నేడు ఇక్కడ ఉన్నారన్నారు. అమెరికా సామ్రాజ్యవాదమే ఇజ్రాయిల్ బలమన్నారు. అమెరికా మద్దతు లేకపోతే ఇజ్రాయిల్ బలహీనమవుతుందని, పలస్తీనాకు విముక్తి లభిస్తుందని కొందరు అభిప్రాయపడ్డారు. కాగా, నాలుగు బిలియన్ డాలర్ల విలువ చేసే సామాగ్రిని ఇజ్రాయిల్‌కు అమెరికా ఏటా సరఫరా చేస్తుంటుంది. తాజా పరిణామాల క్రమంలో అదనంగా రెండు బిలియన్ డాలర్ల ప్యాకేజిని ఇజ్రాయిల్ కోసం బైడెన్ సర్కార్ సిద్ధం చేస్తోంది. అయితే అమెరికాలోని యూదుల భద్రత, ప్రార్థనాలయాలు, స్కూళ్లపై హింస జరగకుండా అదనపు బలగాలను మోహరించేలా న్యూయార్క్ నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్ ఆదేశాలిచ్చారు.

మానవతా కారిడార్ ఏర్పాటు చేయండి

ఇజ్రాయిల్‌కు డబ్ల్యూహెచ్‌ఓ పిలుపు

జెరూసలేం: గాజాపై ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని, దిగ్బంధనం తొలగించాలని ఇజ్రాయిల్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సూచించింది. మానవతా కారిడార్ ఏర్పాటు చేయాలని కోరింది. తద్వారా అత్యవసర మందులు పలస్తీనా ఆసుపత్రులకు సరఫరా చేసేందుకు వీలు కలుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. తీవ్రంగా గాయపడిన వారిని సురక్షితంగా గాజా ఆసుపత్రుల నుంచి తరలించడం ముప్పుతో కూడుకున్నదని పేర్కొంది. అనారోగ్యంగా ఉన్న వారిని మృత్యు ఒడికి చేర్చేలా ఇజ్రాయిల్ కరువుగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టింది. గాజాను ఖాళీ చేయడమంటే ఆషామాషీ వ్యవహారం కాదని రోగులు, హెల్త్ వర్కర్లు, ఇతర పౌరులకు ఇది సవాళ్లభరితమని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని ఇజ్రాయిల్‌ను కోరింది. అమాయకుల జీవితాలతో చెలగాటం వద్దని సూచించింది. పలస్తీనాలోని ఆసుపత్రులకు అత్యవసర మందులను సరఫరా చేసేందుకు తక్షణమే మానవతా కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కోరింది.

ఇద్దరు హమాస్ కమాండర్లు హతం

జెరూసలేం: హమాస్ కమాండర్లు ఇద్దరిని మట్టుబెట్టినట్టు ఇజ్రాయిల్ సైన్యం శనివారం ప్రకటించింది. వారం రోజులుగా కొనసాగుతున్న భీకర పోరులో కీలకంగా వ్యవహరించిన మీరద్ అబు మీరద్, అలీ కాదీని సాయుధ దళాలు హతమార్చినట్లు ప్రకటన చేసింది. మీరద్ అబు హమాస్ వైమానిక వ్యవస్థకు అధిపతి కాగా అలీ కాదీ కమాండో దళానికి కమాండర్ అని తెలిపింది.

న్యాయానికి సంకెళ్లు పేరుతో

నేడు టీడీపీ నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై 'న్యాయానికి సంకెళ్లు' పేరిట మరో నిరసన కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ పిలుపునిచ్చింది. ఆ మేరకు పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుని అక్రమంగా అరెస్ట్ చేయించి న్యాయానికి సంకెళ్లు వేసిన సీఎం జగన్ నియంతృత్వ పోకడలు దేశమంతా తెలిసేలా ఆదివారం రాత్రి 7 గంటల నుంచి 7.05 నిముషాల మధ్యలో చేతులకు తాడు, లేదా రిబ్బను కట్టుకుని నిరసన తెలపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. న్యాయానికి ఇంకెన్నాళ్లీ సంకెళ్లని నినదించాలన్నారు. ఆ వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసి చంద్రబాబు ధర్మపోరాటానికి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు.

చంద్రబాబుకు అత్యవసరంగా ఏసీ

జైలు అధికారులకు ఏసీబీ కోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబుకి అత్యవసరంగా ఏసీ సౌకర్యం కల్పించాలని జైలు అధికారులను ఏసీబీ కోర్టు ఆదేశించింది. చంద్రబాబుకి మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ ఆయన తరపు లాయర్లు శనివారం సాయంత్రం దాఖలు చేసిన హౌస్‌మోషన్ పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టు అత్యవసరంగా ఆన్‌లైన్ ద్వారా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చంద్రబాబుకు వైద్యులు ఇచ్చిన నివేదికను పరిశీలించాలని కోర్టును న్యాయవాదులు కోరారు. వైద్యుల సూచన మేరకు ఆయనకు చల్లని వాతావరణ పరిస్థితులు కల్పించాలని పిటిషన్‌లో న్యాయవాదులు పేర్కొన్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రికి తరలించాలని కూడా ఏసీబీ కోర్టుకు చంద్రబాబు న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. దీనిపై తక్షణమే చంద్రబాబుకు ఏసీ సౌకర్యం కల్పించాలని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

అర్థవంత శాంతి చర్చలేవి?

(మొదటిపేజీ తరువాయి)

చోటుచేసుకోలేదు. చివరికి నాయకులు గవర్నరును కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంపై స్థానిక కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం, ఆప్ సహా ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలు సంతకాలు చేశారు. మణిపూర్‌లో జాతుల సంక్షోభం పరిష్కారానికి సరైన చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శించారు. రాష్ట్రంలో నిషేధాజ్ఞలు ఎత్తివేయాలని, శాంతిచర్చలు వేగవంతం చేయాలని, సహాయ ప్యాకేజీలు పెంచాలని, చనిపోయిన ఇద్దరు మెయితీ జాతీయుల భౌతికకాయాలు అప్పగించాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. వాక్‌స్వాతంత్ర్యం, సమావేశమయ్యే స్వేచ్ఛ, ప్రభుత్వంపై నిర్మాణాత్మక విమర్శలు సహా తమ ప్రాథమిక హక్కుల నుంచి ప్రజలను నియంత్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించిందని ఆరోపించారు. భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి వంటిదని ప్రధాని నరేంద్రమోదీ పదేపదే చెబుతున్నారని, అలాంటప్పుడు తమ ఆందోళనకు ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు. వ్యక్తులు, పత్రికలకు స్వేచ్ఛగా తమ అభిప్రాయం వెల్లడించే హక్కు ఉందన్నారు. ప్రభుత్వ అక్రమాలు, పొరపాట్లను ఎత్తిచూపితే కక్షసాధిస్తారా అని నిలదీశారు. ప్రజలు స్వేచ్ఛగా సమావేశమయ్యే హక్కును కాలరాస్తున్నట్లు ఆరోపించారు. మణిపూర్‌లో మొబైల్ ఇంటర్నెట్ నిషేధం కొనసాగుతోంది. 143 రోజుల తర్వాత నిషేధం ఎత్తివేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిషేధం అమలులోకి తీసుకొచ్చింది. జాతుల హింస చెలరేగిన నాటి నుంచి రాష్ట్రంలో అర్థవంతమైన శాంతియుత చర్చలు జరగలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. జాతుల మధ్య ఘర్షణ సంక్షోభంలో జోక్యం చేసుకోరాదన్న మార్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంచుకున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు.

అయితే, రాష్ట్రంలో జరుగుతున్న హింస రెండు జాతుల మధ్య కాదని ముఖ్యమంత్రి ఎన్.బీరేన్‌సింగ్ వాదిస్తున్నారు. జాతుల హింసకు కుకీ తీవ్రవాదులే కారణమని చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కేంద్రప్రభుత్వం శాంతిచర్చలకు జూన్‌లో ప్రయత్నించింది. అయితే, శాంతికమిటీ కూర్పుపై అసంతృప్తితో మెయితీలు, కుకీలు చర్చలకు ముందుకు రాలేదు.

ప్రమాదంలో ఆర్థిక వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

అంతే నష్టమని మెజారిటీ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ దారుణంగా పడిపోతున్నదని, ఇటువంటి సమయంలో దేశంలో డాలర్ నిల్వలు క్షీణించడం ఎంతమాత్రం మంచిది కాదని చెబుతున్నారు. ముడి చమురు దిగుమతులు భారమవుతాయని, ఫలితంగా ద్రవ్యోల్బణం పెచ్చుమీరి, ఆర్‌బీఐ వడ్డీరేట్లు పెరిగి, రుణ లభ్యత తగ్గుతుందని పేర్కొంటున్నారు. ఇవన్నీ కూడా దేశ జీడీపీ వృద్ధికి సవాలు విసిరేవేనంటున్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై ఆర్‌బీఐతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా దృష్టి సారించాలని లేకపోతే మాంద్యం బారినపడటం ఖాయమని హితవు పలుకుతున్నారు. అసలే అంతర్జాతీయంగా రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు చాలవన్నట్లు ఇజ్రాయెల్-పలస్తీనా యుద్ధం వచ్చిపడిందని, ఇది ముదిరితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గడ్డు కాలమేనని వ్యాఖ్యానిస్తున్నారు. కరోనా నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆర్థిక వ్యవస్థకు కోలుకోలేని దెబ్బ తగులుతుందని ఒకింత భయాందోళనలు వెలిబుచ్చుతున్నారు. భారత ఫారెక్స్ రిజర్వుల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు గత నెల 29 నుంచి ఈ నెల 6 మధ్య మరో 707 మిలియన్ డాలర్లు దిగి 519.529 బిలియన్ డాలర్లకు తగ్గాయి. బంగారం నిల్వలు సైతం ఈ వారం రోజుల్లో 1.425 బిలియన్ డాలర్ల మేర తగ్గి మొత్తం ఫారెక్స్ రిజర్వుల్లో 42.306 బిలియన్ డాలర్లకు దిగాయి.

ఆత్మహత్య కాదు... సర్కారీ హత్యే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నిరుద్యోగ యువతి ప్రవల్లికది ఆత్మహత్య కాదని, అది సర్కారీ హత్యేనని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రవల్లిక ఉద్యోగ సాధనలో భాగంగా అనేక సర్వీస్ కమిషన్ పరీక్షలు రాస్తోందని శనివారం సోషల్ మీడియా వేదికగా నారాయణ స్పందించారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-1, 2 పరీక్షలు సక్రమంగా జరగడం లేదన్నారు. ఇవన్నీ తెలంగాణ సర్కారు వైఫల్యాలుగా భావిస్తున్నామని చెప్పారు. ఒకవైపు నీళ్లు, నిధులు, నియామకాలను మేనిఫెస్టోలో తెలంగాణ సర్కార్ పెట్టుకుందన్నారు. అవి ఎక్కడ వచ్చాయని, నిరుద్యోగులకు ఏమి అందాయని ప్రశ్నించారు. ప్రవల్లికది కేవలం తెలంగాణ సర్కారీ హత్యగానే తాము భావిస్తున్నామని నారాయణ పునరుద్ఘాటించారు. చనిపోయిన ప్రవల్లిక భౌతిక కాయాన్ని తాము చూసేందుకు వెళ్తుండగా, పోలీసులు అడ్డంకులు సృష్టించి, హడావిడిగా వరంగల్‌కు తీసుకెళ్లి పోవడానికి తప్పుపట్టారు. ప్రవల్లిక మిత్రులు, బంధువులను రానీయకుండా వారి తల్లిదండ్రుల మధ్య పోలీసుల బందోబస్తు నడుమ దహనం చేయడాన్ని దుయ్యబట్టారు. ప్రవల్లిక ఆత్మహత్య ఘటన తప్పని తెలంగాణ సర్కార్ గ్రహించిందని, అందుకే అలాంటి చర్యలకు ఒడిగట్టిందని విమర్శించారు. ప్రవల్లిక బతికుంటే 60 ఏళ్ల పాటు వారి కుటుంబాన్ని పోషించేదని, వారికి ఆర్థికంగా అండగా నిలిచేది కదా? అని అన్నారు. ప్రవల్లిక కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, వారి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని నారాయణ డిమాండ్ చేశారు.

చంద్రబాబు ఆరోగ్యంపై హైటెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

గమనించిన భువనేశ్వరి, లోకేశ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ములాఖత్ అనంతరం మీడియాతో మాట్లాడకుండానే వారిద్దరూ అక్కడి నుంచి కంట తడితోనే వెళ్లిపోయారు. గత ములాఖత్ నాటికి, నేటికి చంద్రబాబు ఆరోగ్యంలో చాలా మార్పు వచ్చినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ములాఖత్ అనంతరం ప్రభుత్వ వైద్యులు ఇచ్చిన నివేదికను డీఐజీ రవికిరణ్‌కు చూపించి దానిని అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ లోకేశ్ నిలదీశారు. చంద్రబాబుకు ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు ఓ పక్క స్పష్టంగా నివేదిక ఉన్నప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబుకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు వైద్యులు సూచన చేసి 48 గంటలు దాటినా ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. ఒక మాజీ ముఖ్యమంత్రి విషయంలో ఇంత దారుణంగా వ్యవహరిస్తారా? అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీ హైడ్రేషన్ బారిన పడిన చంద్రబాబును చల్లని వాతావరణంలో పెట్టాలని వైద్యులు సూచిస్తే... ఎందుకు అమలు చేయలేదు? వైద్యుల సూచనలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందా? లేదా? చెప్పాలని నిలదీశారు. చంద్రబాబు అనారోగ్యంపై వాస్తవాలను దాచిపెట్టడం, డాక్టర్ నివేదికలు తొక్కి పట్టడంపై లోకేశ్ మండిపడ్డారు. లోకేశ్ ప్రశ్నలకు ఎలాంటి సమాధానం చెప్పకుండా ములాఖాత్ సమయం అయిపోయిందని, ఇక వెళ్లాలని డీఐజీ దురుసుగా వ్యవహరించినట్లు లోకేశ్ తెలిపారు. ఇక కుటుంబ సభ్యులతో పాటు ములాఖత్ ద్వారా కలిసిన తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కూడా చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని మీడియాకు తెలిపారు. మాజీ మంత్రులు జవహర్, పీతల సుజాత మీడియాతో మాట్లాడుతూ జైలులో ఉన్న చంద్రబాబు ఆరోగ్యం క్షీణించడన్న ఆవేదనతోనే లోకేశ్, భువనేశ్వరి మీడియాతో మాట్లాడలేకపోయారని తెలిపారు. చంద్రబాబుకు ఏదైనా హాని జరిగితే జగన్ ప్రభుత్వం బాధ్యత వహించాలని వారు హెచ్చరించారు.

కోర్టును ఆశ్రయించాలని టీడీపీ నిర్ణయం

చంద్రబాబు ఆరోగ్యంపై ప్రభుత్వం కావాలని నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో కోర్టును ఆశ్రయించాలని టీడీపీ నిర్ణయించింది. విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేసేందుకు న్యాయవాదులు సిద్ధమయ్యారు. వైద్యులు ఇచ్చిన నివేదికను కోర్టుకు అందించి.. చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలని న్యాయవాదులు కోరనున్నారు. చంద్రబాబు తరపు న్యాయవాదులు పిటిషన్ సిద్ధం చేస్తున్నారు. ములాఖత్‌కు వెళ్లి వచ్చిన అనంతరం రాజమండ్రిలో న్యాయవాదులతో లోకేశ్ సమావేశమయ్యారు. న్యాయవాదులు, వ్యక్తిగత వైద్యుల సూచనల మేరకు చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలని పిటిషన్‌లో న్యాయవాదులు కోరనున్నారు. కోర్టుకు శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో ఏం చేయాలనే అంశంపై న్యాయవాదులు చర్చలు జరుపుతున్నారు.

కుటుంబ సభ్యులదే బాధ్యతంటూ మంత్రుల ఎదురుదాడి

పరిస్థితి ఇంత ఆందోళనకరంగా ఉన్నప్పటికీ మంత్రులు మాత్రం దీనిని కూడా రాజకీయకోణంలోనే చూస్తూ ప్రతిపక్షంపై విమర్శలు గుప్పిస్తున్నారు. పైగా చంద్రబాబుకు ఏదైనా జరిగితే ఆయనకు భోజనం పంపిస్తున్న కుటుంబ సభ్యులదే బాధ్యత అంటూ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎదురుదాడికి దిగారు. మంత్రి బొత్స సత్యనారాయణ ఇదంతా టీడీపీ డ్రామా అంటూ తేలిగ్గా కొట్టిపారేశారు.

భద్రత విషయంలో అప్రమత్తంగానే ఉన్నాం : జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్

డీఐజీ రవికిరణ్ మాట్లాడుతూ చంద్రబాబు లాంటి ప్రముఖ వ్యక్తి ఆరోగ్యం, భద్రత విషయంలో అప్రమత్తంగానే ఉన్నామని తెలిపారు. ఆయన ఆహార అలవాట్లు ఏమిటో వైద్యులు తెలుసుకున్నారని, అందుకు అనుగుణంగా ఐదుగురు వైద్యులు ఆయనకు చికిత్స అందించినట్టు చెప్పారు. అన్ని విషయాలు కోర్టు దృష్టికి తీసుకువెళతామని అన్నారు. తాజా వైద్యుల నివేదికను, చంద్రబాబుకు ఇస్తున్న మందులను కూడా కోర్టు దృష్టికి తీసుకువెళతామని, న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆయనకు వైద్య సేవలందిస్తామని తెలిపారు. జైలులో ఏసీ పెట్టేందుకు ప్రిజన్ రూల్స్ ఒప్పుకోవని, ప్రత్యేక కేసుగా పరిగణించి కోర్టు ఆదేశిస్తే అప్పుడు పరిశీలిస్తామని వెల్లడించారు. లోకేశ్‌తో వాగ్వాదంపై డీఐజీ స్పందిస్తూ ఎవరితో ఎలా వ్యవహరించాలనే దానిపై ప్రొటోకాల్ ఉంటుందన్నారు. ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదని, ములాఖత్ సమయం ముగిసిందని చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు.

ఇక ఎంపీ విజయసాయిరెడ్డి అయితే ప్రజల్లో అలజడి సృష్టించేందుకే టీడీపీ దుష్ప్రచారం చేస్తోందంటూ విమర్శించారు. మరో మంత్రి అంబటి రాంబాబు ఆరోగ్యం బాగోలేకపోతే కోర్టులో పిటీషన్ వేసుకోవాలని సలహా ఇచ్చారు. జైలులో ఎక్కడైనా ఏసీ పెడతారా అని ప్రశ్నించారు. ఇలా వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రవ్యాప్తంగా క్షీణిస్తున్న చంద్రబాబు ఆరోగ్యంపై కూడా రాజకీయ కోణంలోనే తిప్పికొడుతూ వెటకారపు వ్యాఖ్యలు చేశారు.

చల్లని ప్రదేశంలో ఉంచాలి : వైద్యులు

చంద్రబాబు ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని, అయితే ఆయనకు చల్లటి వాతావరణం అవసరమని ప్రభుత్వ వైద్యులు స్పష్టం చేశారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోన్న నేపథ్యంలో శనివారం సాయంత్రం రాజమహేంద్రవరం జైలు ఆవరణలో చంద్రబాబుకు చికిత్స అందిస్తున్న వైద్యులతో కలిసి జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు మాట్లాడుతూ చంద్రబాబు వేసుకునే మందులు మాకు చూపించారు. అవి చూసిన తర్వాతే మిగతా మందులు సూచించాం. చంద్రబాబును చల్లగా ఉండే ప్రదేశంలో ఉంచాలని జైలు అధికారులకు ఇప్పటికే సూచించాం. చల్లని వాతావరణం లేకపోతే మేము ఇచ్చిన మందులు ఎంతవరకు పని చేస్తాయో తెలియదు. ఆయనకు ఎలాంటి స్టెరాయిడ్స్ ఇవ్వడం లేదు. గతంలో ఆయనకు ఉన్న ఆరోగ్య సమస్యలు ఏమిటో మాకు తెలియదని ప్రభుత్వ వైద్యులు వివరించారు.

18న కడపలో రాష్ట్ర సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

పెట్టేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టులో ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీలో ఉండగానే కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వటంతో ఉద్దేశమేమిటని రామకృష్ణ నిలదీశారు. కర్నాటక ఎన్నికల సందర్భంగా వివాదాస్పదంగా ఉన్న ఎగువభద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి రూ.5600 కోట్లు కేటాయించారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు మొదటి దశ కుదించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. సీఎం జగన్ ప్రాజెక్టులపై పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కరువుతో అల్లాడిపోతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో సీమ ప్రాజెక్టులపై సీపీఐ రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కడప సదస్సుకు 12 జిల్లాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నీటిపారుదలరంగ నిపుణులు, రైతుసంఘాల నేతలు, న్యాయవాదులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. అందరి అభిప్రాయాలు తీసుకుని ఉద్యమానికి శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. తొలుత రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను రామకృష్ణ ఆవిష్కరించారు.

అదానీ, జగన్ మధ్య ఇటీవల జరిగిన రహస్య సమావేశం వెనుక బీచ్ శాండ్, మినరల్స్, మైనింగ్ అంశం దాగుందని రామకృష్ణ చెప్పారు. ఆ చర్చలో పరిశ్రమల శాఖమంత్రిగానీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగానీ, ఇతర ఉన్నతాధికారులు ఎవరూ లేరన్నారు. కమీషన్‌లకు కక్కుర్తిపడి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేందుకు జగన్ పూనుకున్నారని ఆరోపించారు. శ్రీకాకుళంలో వెయ్యి హెక్టార్‌లలో ఉన్న బీచ్‌శాండ్‌ను అదానీకి అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. యుద్ధపరికరాల్లో వినియోగించే బీచ్ శాండ్ మినరల్స్ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండకుండా కేంద్రం నిషేధించిందన్నారు. కేంద్రం నిషేధాన్ని రద్దు చేయించి, అదానీకి అప్పగించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి, పరిశ్రమల శాఖమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. జగన్, అదానీ రహస్య ఒప్పందాన్ని ప్రజలకు వివరించాలని, జగన్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని రామకృష్ణ స్పష్టంచేశారు.

చంద్రబాబు ఆరోగ్యంపై వ్యంగ్యాస్త్రాలు సబబు కాదు

స్కిల్‌కుంభకోణం కేసులో రాజమండ్రి జైలులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్యం బాగాలేదని వస్తున్న వార్తలపై వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు మాట్లాడటం, వ్యంగ్యాస్త్రాలు సంధించడం, అపహాస్యం చేయడం సబబు కాదని రామకృష్ణ హితవు పలికారు. ప్రత్యర్థిని రాజకీయంగా చూడాలే తప్ప ఆరోగ్యం బాగాలేదంటే దాన్ని అపహాస్యం చేయటం మంచిపద్ధతి కాదన్నారు. ప్రతిపక్షనేత ఆరోగ్యం కాపాడటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మంచి ఆసుపత్రిలో చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

17న వలసలపై అనంతపురంలో సదస్సు: జల్లి విల్సన్

అనావృష్టి పరిస్థితులతో రాయలసీమలో కరువు నెలకొందని, దీంతో వ్యవసాయ కూలీలు వలసపోతున్నారని, ప్రభుత్వం కరువు నివారణ చర్యలు తీసుకుని వలసలు ఆపాలని కోరుతూ అక్టోబరు 17వ తేదీన అనంతపురంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం అధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తెలిపారు. సదస్సులో రాజ్యసభలో సీపీఐ పక్ష నేత వినయ్ విశ్వం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీటి ప్రాజెక్టులపై పనిచేసిన ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారని చెప్పారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 365 రోజులు అమలయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ పథకం నిధులను ఇతర పథకాలకు మళ్లిస్తున్నారని, దీనివల్ల పనులు లేక గ్రామీణ పేదలకు ఆదాయం లేకుండా పోతుందన్నారు. రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని, కనీసం 200 రోజులు పని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదస్సు అనంతరం భవిష్యత్ పోరాటానికి సమాయత్తమవుతామని వివరించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, గుజ్జుల ఈశ్వరయ్య, అక్కినేని వనజ పాల్గొన్నారు.

యువత కలలు, ఆకాంక్షల హత్య

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. టీఎస్‌పీఎస్‌సీలో అక్రమాలు, గ్రూప్ పరీక్షలు తరచూ వాయిదా పడటంతో మనస్తాపానికి గురై ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని ఆయన తెలిపారు. మృతురాలి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. 'ఎన్నికల నిర్వహణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేతకానితనం కారణంగా తెలంగాణలో వేలాదిమంది నిరుద్యోగులు నిస్పృహకు గురవుతున్నారు. యువత ఆత్మహత్యలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసమర్థత, అవినీతి కారణం. అందుకే తెలంగాణ నుంచి బీఆర్‌ఎస్‌ను తరిమికొడదాం' అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు.

ప్రవళిక ఆత్మహత్య వార్త తనను తీవ్రంగా కలచివేసిందని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. తెలంగాణ యువత నిరుద్యోగంతో తీవ్ర నిరాశకు గురవుతోందని తెలిపారు. విద్యార్థిని మృతి వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యానని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పోస్టు చేశారు. పదేపదే పరీక్షలు వాయిదా పడటం కారణంగా యువత బాధపడుతున్నారని, ఇది దురదృష్టకరం, సిగ్గుచేటని ప్రియాంక చెప్పారు. తెలంగాణ యువత నిరుద్యోగంతో పోరాడుతోందని, కష్టపడి చదివినా ఫలితం లేక యువత భవిష్యత్ అంధకారంలో పడిందన్నారు. ఈ పరిస్థితులన్నింటినీ తాము మారుస్తామని భరోసా ఇచ్చారు.

ప్రవళిక ఆత్మహత్య...అభ్యర్థుల ఆందోళన

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఒక అభ్యర్థిని ఆత్మహత్యకు పాల్పడటం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో కలకలం సృష్టించింది. చిక్కడపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోటీ పరీక్షలకు తయారవుతున్న అభ్యర్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా బిక్కాజిపల్లికి చెందిన మర్రి ప్రవళిక (23) అశోక్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ గ్రూప్-2 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. శుక్రవారం సాయంత్రం హాస్టల్‌లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆమె ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా... అప్పటికే అక్కడికి చేరుకున్న అభ్యర్థులు అడ్డుకున్నారు. పరీక్ష వాయిదా పడటం వల్లే మనస్తాపంతో ప్రవళిక ఆత్మహత్య చేసుకుందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అర్ధరాత్రి వరకు మృతదేహం హాస్టల్‌లోనే ఉంది. ఆయా పార్టీల నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని నిరసన తెలిపారు. కాగా, ప్రవళిక రాసిన సూసైడ్ నోట్‌గా చెబుతున్న లేఖ వాట్సాప్ గ్రూప్‌లో చక్కర్లు కొట్టింది. 'నన్ను క్షమించండి అమ్మా! నేను చాలా నష్టజాతకురాలిని. నా వల్ల మీరు ఎప్పుడూ బాధపడుతూనే ఉన్నారు. ఏడవకండి అమ్మా...మీకు పుట్టడం నా అదృష్టం అమ్మా... నన్ను కాళ్ల కింద పెట్టకుండా చూసుకున్నారు.. మీకు నేను చాలా అన్యాయం చేస్తున్నా...మీ కోసం నేను ఏమీ చేయలేకపోతున్నా... నాన్న జాగ్రత్త' అంటూ ఆ లేఖలో ఉంది. ఆందోళనకు దిగిన అభ్యర్థులపై పోలీసులు అర్ధరాత్రి దాటిన తర్వాత లాఠీచార్జి చేశారు. దాంతో పోలీసులపై అభ్యర్థులు రాళ్లు రువ్వారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమ రాత్రి 1.30 సమయంలో ప్రవళిక మృతదేహాన్ని పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు, కాగా, ప్రవళిక ఆత్మహత్య వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. ఆమె ఆత్మహత్యపై కాంగ్రెస్, బీజేపీ, ఇతర ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. ప్రవళికది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్య అని నిందించాయి. తెలంగాణలో నిరుద్యోగులు బతకడమే కష్టంగా మారిందని నిందించాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేతకానితనం వల్ల నిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతున్నట్లు విమర్శించాయి.

బీజేపీని ఓడిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

పునరుద్ధరణతో పాటు 70 లక్షల ఈపీఎస్-95 ఫించన్‌దారులకు 2014 నుంచి నెలకు రూ.1000 మాత్రమే చెల్లించడం, దానిని పెంచకపోవడం వంటి అనేక అంశాలపై పోరాటాల కార్యాచరణను సిద్ధం చేసే అంశమై చర్చించినట్లు ఐక్యవేదిక తెలిపింది. రాజస్తాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, చత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న క్రమంలో మధ్యప్రదేశ్, మిజోరంలో బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాల గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా మిగతా రాష్ట్రాల్లో అది గెలవకుండా చూడాలని కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఐక్యవేదిక సంకల్పించింది.

'అదానీ' ముంబై విమానాశ్రయాలపై దర్యాప్తు

(మొదటిపేజీ తరువాయి)

విమానాశ్రయాల బిడ్‌లను గెలుచుకుంది. లక్నో, మంగళూరు, అహ్మదాబాద్, జైపూర్, గువహటి, తిరువనంతపురం విమానాశ్రయాలు అదానీ సంస్థ పరిధిలోకి వచ్చాయి. మరో 50ఏళ్లకుపైగా ఈ విమానాశ్రయాల నిర్వహణ, అభివృద్ధి బాధ్యతలను ఇదే సంస్థ నిర్వర్తిస్తుంది. హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడినప్పటి నుంచి అదానీ గ్రూపు న్యాయ చిక్కుల్లో పడిన విషయం తెలిసిందే.

బుద్ధవనం అద్భుతం: దక్కన్ కాలేజీ విద్యార్థులు

నందికొండ: నాగార్జునసాగర్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన బుద్ధవనం ప్రాజెక్టు తమను ఎంతగానో ఆకట్టుకుందని పూనెలోని దక్కన్ కాలేజీ ఎంఏ పురావస్తు శాస్త్రం విద్యార్థులు అన్నారు. ఆచార్య గన్‌వీర్ అధర్యంలో 40 మంది విద్యార్థులు బుద్ధ క్షేత్రాల అధ్యయనంలో భాగంగా శనివారం ఇక్కడి బుద్ధవనాన్ని సందర్శించారు. మల్లేపల్లి లక్ష్మయ్య సహకారంతో ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా. ఈమని శివనాగిరెడ్డి దక్కన్ కాలేజీ విద్యార్థులకు బుద్ధవనంలోని ఎంట్రన్స్ ప్లాజా, బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్థూపవనం, మహాస్థూపాల గురించి వివరించారు. బుద్ధవనం చూసి విద్యార్థులు మంత్రముగ్ధులయ్యారని, బుద్ధవనం వంటి బుద్ధవారసత్వ తీన్మార్కును తామెక్కడా చూడలేదన్నారు. బుద్ధుని జీవిత జాతక కథలు, బౌద్ధచిహ్నాలు, వాస్తువిశేషాలపై విద్యార్థుల ప్రశ్నలకు శివనాగిరెడ్డి సవివరంగా సమాధానాలు చెప్పారు. బుద్ధవనం శిల్ప సౌందర్యం తమను మంత్రముగ్ధుల్ని చేసిందని, నిర్మాణాలు అద్భుతమని విద్యార్థులు చెప్పినట్లు శివనాగిరెడ్డి తెలిపారు.

ప్రవళిక ఆత్మహత్య బాధాకరం

ఏపీ నిరుద్యోగ జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణలో నిరుద్యోగ యువతి ప్రవళిక ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగ ప్రకట నలు సకాలంలో రావడం లేదని, ఒకవేళ ఏవైనా వచ్చినా అవి వాయిదా పడటం, కొన్ని కోర్టు కేసులలో చిక్కుకోవడం నిరుద్యోగ యువతను నిరాశకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. నోటిఫికేషన్లు ఏళ్లతరబడి ఆలస్యం కావడంతో వయోపరిమితి సమస్య తలెత్తడం, చదివిన చదువులు వృధా అవుతున్నాయనే దిగులుతో ఎంతోమంది బాధపడు తున్నారని, నిరుద్యోగ యువత ఆత్మహత్యకు గురవుతున్నారని తెలిపారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని సూచించారు. నిరుద్యోగ యువత ఆత్మహత్యలు పునరావృతం కాకుండా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని రాజకీయ పార్టీల నేతలు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. తల్లితండ్రులు సైతం నిరుద్యోగ యువతపై ఒత్తిడి పెట్టవద్దని హితవు పలికారు. నిరుద్యోగులను సమాజంలో చిన్నచూపు చూడరాదని, వారు ఏదో ఒక రోజు ప్రయోజకులు అవుతారనే భరోసా ఇవ్వాలని కోరారు.

చంద్రబాబు ఆరోగ్యంపై వైద్య బృందాన్ని నియమించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు ఆరోగ్యంపై నిపుణులైన వైద్య బృందాన్ని నియమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబు ఆరోగ్యంపై మీడియాలో వస్తున్న కథనాలపై శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఆరోగ్యంపై అధికారులు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అవసరమైతే చంద్రబాబును ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో

114 చెరువులు నింపేందుకు తక్షణ చర్యలు చేపట్టండి

సీఎం జగన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులను నీటితో నింపేందుకు ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. జీడిపల్లి నుంచి కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌ను కలుపుతూ బీటీపీకి నీళ్లు తీసుకుపోయే విధంగా అన్ని అనుమతులు, భూసేకరణతో జీడిపల్లి బీటీపీ బ్రాంచ్ కెనాల్ నిర్మాణానికి సివిల్, ఇంజనీరింగ్ వర్క్‌లకు రూ.960 కోట్ల అంచనాతో గత ప్రభుత్వం 2018 అక్టోబరు 10న ప్రారంభించటం జరిగిందన్నారు. 8 లిఫ్టులు, 8 పంప్ హౌస్‌లు ఏర్పాటు చేస్తూ 92 కిలోమీటర్ల కెనాల్ తవ్వాల్సి ఉండగా, 32 కిలోమీటర్లు మెయిన్ బ్రాంచ్ కెనాల్, 30 కిలోమీటర్లు కుందుర్పి బ్రాంచ్ కెనాల్, 30 కిలోమీటర్లు బీటీపీ గ్రావిటీ బ్రాంచ్ కెనాల్ తవ్వాల్సి ఉండగా గత ప్రభుత్వంలో అక్కడక్కడ కొంత భాగం కెనాల్‌ను తవ్వారని తెలిపారు. కోస్లాన్ కంపెనీ నుంచి మోటార్లను కొనుగోలు చేసిందని, 1,406 ఎకరాలు భూసేకరణ చేశారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఈ ప్రాజెక్టును అటకెక్కించారని పేర్కొన్నారు. జులై 8న రాష్ట్ర ముఖ్యమంత్రిగా మీరు రైతు దినోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గం వచ్చి మూడు రోజులలో రూ.208 కోట్లు నిర్వాసితులైన రైతుల ఖాతాల్లో వేస్తానని హామీ ఇచ్చారని, మూడు నెలలు గడిచినా రూ.50 కోట్లు కూడా నిర్వాసితులకు ఇవ్వలేదని గుర్తు చేశారు. రూ.135 కోట్లు ఇస్తానంటూ ఇచ్చిన జీవో 2683 పేపర్లకే పరిమితమైయిందన్నారు. ఇందులో నిర్వాసితులకు రూ.80 కోట్లు, సివిల్ వర్క్‌కు రూ.50 కోట్లు అని చెప్పినవి కూడా ఇంతవరకు పూర్తిగా విడుదల కాలేదన్నారు. అసైన్మెంట్ రైతులకు డబ్బులు ఇవ్వకుండా వంచనకు గురి చేస్తున్నారని విమర్శించారు. తగాదాల పేర్లతో చాలామంది రైతులను, అర్హులను పక్కకు పెట్టారని తెలిపారు. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన మోటర్లు, సామాగ్రి తుప్పుపట్టి పోయినా ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇంతవరకు ఒక్క పంప్ హౌస్ కూడా నిర్మించలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న కళ్యాణదుర్గంలో జరిగిన రైతు సదస్సు తక్షణం నిర్వాసితులందరికీ పరిహారం ఇచ్చి, హంద్రీ-నీవా నుంచి 2 టీఎంసీల నీటిని కేటాయించి, కెనాల్ పనులను ప్రారంభించాలని తీర్మానించిందని పేర్కొన్నారు. మరోవైపు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో బీటీపీ ప్రాజెక్టుకు 4.4 టీఎంసీల నీటి కేటాయింపులు పరిశీలన ఉన్నప్పటికీ ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదన్నారు. కర్నాటక ప్రభుత్వం వేదావతి నదిపై అక్రమ ప్రాజెక్టులు నిర్మించి నీటిని మొత్తం వాడేస్తుందని తెలిపారు. కర్నాటక ప్రభుత్వం నిర్మించిన వాణీ విలాస్ ప్రాజెక్టుకు 11 టీఎంసీలు కేటాయింపులు ఉండగా, 20 టీఎంసీలకు పైగా అక్రమంగా వాడుకుంటున్న కారణంగా బీటీపీ ప్రాజెక్టు నిరుపయోగంగా తయారైందన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతంలోని 12,800 ఆయకట్టు మొత్తం బీడు భూములుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో కళ్యాణదుర్గం రూరల్ మండలంలో 15 వేల ఎకరాలకు కమ్యూనిటీ డ్రిప్ ఇరిగేషన్ క్రింద జీడిపల్లి నుంచి ఆర్‌టీఎంసీ నీటి కేటాయింపులు కూడా జరిగాయని తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులు నింపే జీడిపల్లి నుంచి కుందర్పి బ్రాంచ్ కెనాల్‌ను కలుపుతూ బీటీపీకి నీటిని తీసుకువెళ్లే కెనాల్‌ను తక్షణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని తాగునీరు, సాగునీటి వనరులు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

భూ రికార్డుల ఆధునీకరణ ఆదర్శనీయం

కేంద్ర బృందం ప్రశంసలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: భూమి రికార్డుల నవీకరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా ఉందని కేంద్రం ప్రశంసించింది. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్ మోడరనైజేషన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరులశాఖ కార్యదర్శి అజయ్ టిర్కీ, సంయుక్త కార్యదర్శి సోన్మోనీ బోరా రెండు రోజులుగా విశాఖ ప్రాంతంలో పర్యటిస్తూ శనివారం క్షేత్రస్థాయిలో జరుగుతున్న రీసర్వే పనులను స్వయంగా పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో అమలు చేస్తున్న భూమి రికార్డుల ఆధునీకరణ గురించి విశాఖ వేదికగా కేంద్ర బృందం శుక్రవారం సమీక్ష నిర్వహించింది. విశాఖ జిల్లా ఆనందపురం మండలం చంద్రాక గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను స్వయంగా పరిశీలించిన కేంద్ర బృందం...ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించింది. గ్రామస్తులతో అధికారులు ముఖాముఖి నిర్వహించారు. రీసర్వే వల్ల సుదీర్ఘకాలంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధికమిం చామని రైతులు కేంద్ర బృందానికి వివరించారు. సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్దార్థ జైన్ రాష్ట్రంలో సర్వే కోసం నిర్దేశించుకున్న లక్ష్యాలను, అనుసరిస్తున్న విధానాలను కేంద్ర అధికారులకు వివరించారు. సర్వే రాళ్లతో సహా ఏ విషయంలోనూ రైతులపై భారం పడకుండా ప్రభుత్వమే అన్నీ చేసిందన్నారు. గ్రామీణాభివృద్ధి, భూవనరులశాఖ సహాయ కార్యదర్శి ఆనంద్, వివిధ రాష్ట్రాల సర్వే విభాగపు అధినేతలు, స్థానిక రెవెన్యూ యంత్రాంగం పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంపై సజ్జల వాస్తవాలు వెల్లడించాలి

బహుజన జేఏసీ నేత బాలకోటయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సలహాదారు హోదాలో ఉండి ప్రభుత్వానికో, ముఖ్యమంత్రికో సలహాలు ఇవ్వటం మానేసి, ప్రజలకు తప్పుడు సలహాలు, తప్పుడు వ్యాఖ్యలు చేయడం తగదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య శనివారం ఒక ప్రకటనలో హితవు పలికారు. సజ్జల ఎమ్మెల్యే కాదు. ప్రజాప్రతినిధి కాదు. పట్టుమని పది ఓట్లతో ఏనాడూ గెలిచిన జన నాయకుడు కూడా కాదు. అధికార ప్రతినిధి అంతకంటే కాదు. కేవలం ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా ఉండి అన్ని విషయాల్లో తలదూర్చి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. రాష్ట్రం అంతా చంద్రబాబు అక్రమ జైలు, ఆయన భద్రత, డీహైడ్రేషన్, చర్మ సంబంధ వ్యాధులు, అనారోగ్యం, జైలు అధికారుల చికిత్స వంటి అంశాలపై ఆందోళన చెందుతుంటే, తనకంటూ కొన్ని మీడియా సంస్థలను దగ్గర పెట్టుకొని రోజువారీ గంటల తరబడి జైలు అంటే అత్తారిల్లు కాదు, దోమలను మేం పంపుతున్నామా? వాటర్ ట్యాంక్ కట్ట మంటారా? భువనేశ్వరి దేవి పంపుతున్న ఆహారంలో ఏమైనా ఉందేమో, 73 ఏళ్ల కుర్రవాడు అన్నారు కదా! అంటూ వెటకారపు వ్యాఖ్యానాలు చేయటం నీచమైన చర్యగా పేర్కొన్నారు. చంద్రబాబు ప్రాణాలకు హాని జరిగితే ప్రభుత్వానికి సంబంధం లేదన్నట్లుగా ముందుగానే వ్యూహం గీసి, చేతులు కాలాక ఆకులు పట్టుకుందాంలే అన్నట్టుగా ఆయన వైఖరి ఉందన్నారు. ఇదే రాజమండ్రి జైలులో దోమ కాటుకు డెంగీ వచ్చి 20 ఏళ్ల సత్యనారాయణ మృతి చెందాడని, భోజనం దగ్గర కొట్లాటలో గాయపడిన ఖైదీ కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందాడని గుర్తు చేశారు. స్వయంగా జైలు అధికారులే జైలు పరిసరాల్లో డ్రోన్ కెమెరా తిరగటాన్ని అంగీకరించిన విషయం సజ్జల మరచిపోయారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పుండు మీద కారం చల్లే మాటలు మానేసి చంద్రబాబు ఆరోగ్యంపై కచ్చితమైన ప్రకటన చేయాలని, అవసరమైన పూర్తి స్థాయి చికిత్స జరిపించాలని బాలకోటయ్య డిమాండ్ చేశారు.

35 రోజులుగా ఏసీ గుర్తుకు రాలేదా?

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబుకు ఏసీ కావాలని టీడీపీ వారు నానాయాగీ మొదలుపెట్టారని, 35 రోజులుగా ఏసీ గుర్తుకు రాలేదా? అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఏసీ కావాలంటున్న వారంతా దేశంలో జైళ్లకు సంబంధించిన నిబంధనలు తెలిసి మాట్లాడాలన్నారు. టీడీపీకి న్యాయవాదులు కావాల్సినంత మంది ఉన్నారని, వారందరికీ జైలు మాన్యువల్ తెలుసని చెప్పారు. జైలు మాన్యువల్ ప్రకారం రిమాండ్ ఖైదీలకు కానివ్వండీ, ఖైదీలకు కానివ్వండీ ఏసీ ఉండబోదని తెలుసని స్పష్టం చేశారు. ఒకవేళ ఏసీ కావాలంటే, చల్లదనం వల్ల చంద్రబాబుకు డెర్మటాలజీ సమస్యలు తగ్గుతాయనుకుంటే, ఆ విషయాన్ని చంద్రబాబు న్యాయవాదులు లేదా చంద్రబాబు కుటుంబం మీడియాలో మాట్లాడి, దాన్ని రాజకీయం చేసుకుంటుందా లేక కోర్టు మెట్లు ఎక్కి కోర్టును అడుగుతుందా..? అని ప్రశ్నించారు. 35 రోజులుగా ఏనాడూ చంద్రబాబు న్యాయ వాదులు తమ క్లయింటుకు ఏసీ కావాలని కోర్టులో పిటిషన్ వేయ లేదని, అంటే దీని అర్థం ఏమిటి? అని నిలదీశారు. గురు, శుక్ర వారాల్లో వాదనలు సాగినప్పుడూ ఈ విషయాన్ని కోర్టులో అడగలేదని గుర్తుచేశారు. చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వమా?, లేక నిర్ణయించా ల్సింది న్యాయస్థానమా? అని ప్రశ్నించారు. న్యాయస్థానం ఏం చెబితే, రాష్ట్ర ప్రభుత్వం అది చేస్తుందని, ఖైదీలకు ఏం ఇవ్వాలో, ఏం ఇవ్వ కూడదో నిర్ణయించేది న్యాయస్థానం అయినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేయడం పూర్తి దిగజారుడుతనమని వైసీపీ భావిస్తోందన్నారు. ముందు క్వాష్ పిటిషన్ వేశారని, అది కుదరలేదని, దానిమీద హైకోర్టుకు వెళ్లినా చంద్రబాబుకు ఊరట రాలేదన్నారు. ఆ తర్వాత సుప్రీం కోర్టుకు వెళ్లినా కుదరలేదని తెలిపారు. అనంతరం చంద్రబాబు న్యాయవాది లూథ్రా కత్తులు-కటార్లు పట్టుకోమన్నారని ఎద్దేవా చేశారు. ఆ తర్వాత ఏసీబీ కోర్టులో ఏకంగా న్యాయవాదుల మీద దాడులు చేయించారని, ఇప్పుడు బాబు ప్రాణానికి ముప్పు ఉందంటూ పచ్చి అబద్ధాల వాదన, డ్రామా మొదలు పెట్టారని మంత్రి అంబటి మండిపడ్డారు.

కార్పొరేట్లకు ఊడిగమే మోదీ ధ్యేయం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్ మూర్తి విమర్శ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మేసి, దేశ ప్రజలను మోసం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి విమర్శించారు. శనివారం కర్నూలులోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల కమ్యూనిటీ హాల్లో నగర కార్యదర్శి పి.రామకృష్ణా రెడ్డి అధ్యక్షతన జరిగిన సీపీఐ నగర స్థాయి సైద్ధాంతిక, రాజకీయ శిక్షణ తరగతులను జేవీవీ సత్యనారాయణ మూర్తి ప్రారంభించి మాట్లాడుతూ దేశంలో అధి కారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొట్టి, బడా కార్పొరేట్ వ్యవస్థలకు తాకట్టు పెడుతోందని విమర్శించారు. చౌకీదార్ అంటూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని కారు చౌకగా అమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని సంపదను కాపాడుతానని, ప్రభుత్వ ఆస్తులకు భద్రతను కల్పిస్తానని అనేక మాయ మాటలు చెప్పిన నరేంద్ర మోదీ, కంచే చేను మేసిన చందంగా తయారయ్యాడని విమర్శించారు. దేశంలోని ప్రభుత్వం రంగ సంస్థలైన రైల్వే, బొగ్గు గనులు, విమానయానం, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, విశాఖ ఉక్కు పరిశ్రమను అంబానీ, ఆదానీకి తాకట్టు పెట్టి, దేశ ప్రజలను నట్టేట ముంచుతున్నాడని జేవీ సత్యనారాయణ మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. నవరత్నాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునే ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉండే ప్రాజెక్టులను నిర్మించి, త్రాగు సాగునీటిని అందిస్తానని అనేక మాయ మాటలు చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక రైతులను, ప్రజలను మోసం చేశాడని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిద్దయ్య మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. రెండు రోజులపాటు శిక్షణ తరగతుల్లో వివిధ అంశాలపై అధ్యయనం చేసి, పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.

రెవెన్యూ శాఖ పేరును

ల్యాండ్, సాధారణ పరిపాలన శాఖగా మార్చాలి

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ శాఖ పేరును ల్యాండ్, సాధారణ పరిపాలన శాఖగా మార్చాలని ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఆఫీస్ సబార్డినేట్ స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకూ ఉన్న నాలుగు రకాల సర్వీస్ రూల్స్ అన్నీ ఏకం చేసి ఉమ్మడి ఏపీ రెవెన్యూ సర్వీస్ రూల్స్‌గా ఆమోదించాలన్నారు. ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.ఎస్.జవహర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో నూతనంగా ఎన్నికయిన ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర కార్యవర్గానికి వివిధ హోదాలలో ఎన్నికయిన ప్రతి ఒక్కరినీ సీఎస్‌కు సంఘ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు పరిచయం చేశారు. బొప్పరాజు మాట్లాడుతూ జూన్ 20వ తేదీని రెవెన్యూ డే గా ప్రకటించాలని, గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) వేతనం రూ.10,500 నుంచి రూ.21 వేలకు పెంచాలన్నారు. గ్రేడ్ -2 వీఆర్వోలను సర్వే ట్రైనింగ్‌తో సంబంధం లేకుండా వారి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరారు. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఆఫీస్ సబార్డినేట్ స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకూ ఉన్న నాలుగు రకాల (ఏపీ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ రూల్స్, ఏపీ మినిస్టీరియల్ సర్వీస్ రూల్స్, ఏపీ రెవెన్యూ సబార్డినేట్ సర్వీస్ రూల్స్, ఏపీ సివిల్ సర్వీస్ రూల్స్-1992) సర్వీస్ రూల్స్ అన్నీ ఏకం చేసి ఉమ్మడి ఏపీ రెవెన్యూ సర్వీస్ రూల్స్‌గా మార్చాలన్నారు. ఆయా డిమాండ్లపై సీఎస్ సానుకూలంగా స్పందించారని బొప్పరాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన వారిలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సిహెచ్. నరసింహారావు, ఉపాధ్యక్షులు ఆర్.వి.రాజేష్, పి.జాహ్నవి, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రెటరి ఆర్.వి.వి.రోహిణి దేవి, రాష్ట్ర కార్యదర్శులు జి.శ్రీనివాస్, బి.అనురాధ, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఎం.వెంకట రాజు, ఎస్.కె.సలీమా, గన్నవరపు శ్రీనివాస్, కె.కిషోర్, జి.నారాయణరాజు ఉన్నారు.

బరువు పెరిగి పూర్తి ఆరోగ్యంతో చంద్రబాబు

- జైలు అధికారుల నివేదికతో వెల్లడి
- ఎంపీ విజయసాయి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు జైల్లో పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని, నెలరోజులు జైల్లో పూర్తి విశ్రాంతితో ఉండేసరికి ఇతరత్రా ఆరోగ్య సమస్యలు కూడా పోయి కిలో బరువు పెరిగారని ఆయన ఆరోగ్య స్థితిపై జైలు అధికారులు విడుదల చేసిన అధికారిక నివేదిక ద్వారా వెల్లడయిందని రాజ్యసభ సభ్యులు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి అన్నారు. సోషల్ మీడియా వేదికగా శనివారం ఈ అంశంపై ఆయన స్పందించారు. అవినీతి కుంభకోణంలో చంద్రబాబుకు బెయిల్ రాకపోయేసరికి టీడీపీ నేతలు అలజడి సృష్టించేందుకు దుష్ప్రచారానికి పాల్పడుతున్నట్లు స్పష్టమైందన్నారు. తెలుగు డ్రామాల పార్టీ నాటకాలు ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు ఆరోగ్య స్థితిపై జైలు అధికారులు విడుదల చేసిన అధికారిక నివేదికను సోషల్ మీడియాలో ఆయన పోస్ట్ చేశారు. చంద్రబాబుకు జైల్లో ప్రత్యేక గది కేటాయించి, ఇంట్లో వండిన ఆహారం మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. బాబు ఆరోగ్య పరిస్థితిని ముగ్గురు డాక్టర్లు రోజుకు మూడు సార్లు తనిఖీ చేస్తున్నారని, ఎనిమిది మంది సెక్యూరిటీ సిబ్బంది కాపలా కాస్తున్నారని వివరించారు. అతను పూర్తి ఆరోగ్యంగా ఉండేందుకు జైలు అధికారులు అన్ని రకాల చర్యలూ చేపడుతున్నారని స్పష్టం చేశారు. ప్రజల సంతృప్తే ప్రామాణికంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు విజయసాయి రెడ్డి తెలిపారు. అనారోగ్య బాధితులకు వైద్య పరంగా చేయి పట్టుకుని నడిపించాలి, చెకప్‌లు, శస్త్ర చికిత్సలు, మందులు అన్నింటా అండగా నిలవాలి. అలాగే ఆరోగ్యశ్రీని వినియోగించుకోవడంపై అవగాహన కల్పించాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని విజయసాయిరెడ్డి తెలిపారు.

ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ అడహాక్ కమిటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లలో పని చేస్తున్న ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం అన్ని మున్సిపల్ కార్పొరేషన్ల ఉద్యోగుల ప్రతినిధులతో ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ అడహాక్ కమిటీని నియమించారు. శనివారం ఏపీ రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అన్ని అంశాలపై చర్చించారు. రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగుల సమస్యలపై భవిషత్ కార్యాచరణ నిమిత్తం ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన సభ్యుల ఏకగ్రీవ ఆమోదంతో ఈ క్రింది ఆడ్ హాక్ కమిటీని నియమించారు. అసోసియేషన్ రాష్ట్ర అడహాక్ కమిటీ అధ్యక్షులుగా ఈశ్వర్ దొప్పలపూడి (మున్సిపల్ కార్పొరేషన్), ప్రధాన కార్యదర్శిగా అక్కరబోయిన అప్పలరాజు (విశాఖపట్నం), సహాధ్యక్షులుగా ఎ.రాంబాబు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, టి.నాగరాజు, ఎస్.కె.దేవరాయలు, విశ్వనాధరెడ్డి, అమర్నాథ్ రెడ్డి నియమితులయ్యారు. మహిళా ఉపాధ్యక్షులుగా జి.హెలెన్, కార్యదర్శులుగా రాంబాబు, ఎస్.వెంకటకృష్ణ, సిహెచ్.మోహన్ గోపాల్, కళ్యాణ చక్రవర్తి, ఎన్.పిచ్చయ్య నియమితులయ్యారు. మహిళా కార్యదర్శిగా డాక్టర్ డి.మాధురి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గాలి సుధాకర్‌తో పాటు జాయింట్ సెక్రటరీలను కోశాధికారిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఉద్యోగుల జేఏసీ గౌరవ అధ్యక్షులు వామన రావు, ఏపీ జేఏసీ అమరావతి కోశాధికారి వి.వి.మురళీకృష్ణ నాయుడు, లేబర్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కిషోర్ కుమార్, 13 కార్పొరేషన్ల నుంచి నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కరాటేలో వీఐటీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖపట్నంలో ఈ నెల 8నుంచి జరుగుతున్న ఇన్విటేషనల్ దక్షిణ భారత కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు రెండు రజత, ఒక కాంస్య పతకాన్ని సాధించారు. బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న వతనేష్ శర్మ బ్లాక్ బెల్ట్ కాటా విభాగంలో రజత పథకం, బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న జాన్ శామ్యూల్ ఆరెంజ్ బెల్ట్ కాటా విభాగంలో రజత పతకం, బి.టెక్ రెండవ సంవత్సరం చదువుతున్న సాయి గణేష్‌కు ఆరెంజ్ బెల్ట్ కాటా విభాగంలో కాంస్య పతకం లభించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి కరాటేలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలైన ఆ విద్యార్థులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు. విద్యతో పాటు, వివిధ క్రీడలు, కళల పట్ల ప్రతిభ కనబరిచే విద్యార్థులను విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని తెలియచేసారు. భవిష్యత్తులో కరాటేలో మరిన్ని పతకాలను సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. డా. ఖదీర్ పాషా (డిప్యూటీ డైరెక్టర్ స్టూడెంట్ వెల్ఫేర్), డాక్టర్ రామచంద్రరావు (ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్) తదితరులు విజేతలను అభినందించారు.

సంపాదకీయం

మోదీ చౌకబారు ఎత్తుగడలు

బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడల్లా కాల పరీక్షకు నిలిచిన భారత విదేశాంగ విధానాన్ని మార్చే ప్రయత్నాలు జరగకపోలేదు. కానీ స్థూలంగా మన విదేశాంగ విధానంలో స్వాతంత్ర్యానంతరకాలం నుంచి వస్తున్న నిరంతరత కొనసాగుతూనే ఉంది. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు ఇజ్రాయిల్‌తో స్నేహంకోసం తాపత్రయ పడుతూనే ఉన్నారు. అయినా పలస్తీనా ప్రజలకు ప్రత్యేక దేశం ఉండాలన్న విధానాన్ని పెద్దగా మార్చలేదు. పలస్తీనా విమోచన సంస్థ నాయకుడు యాసిర్ అరఫాత్ తో ఎప్పుడూ సన్నిహిత సంబంధాలే ఉండేవి. ఇజ్రాయిల్‌తో మైత్రి ప్రతిపాదన మొట్టమొదట తీసుకొచ్చింది బీజేపీ అగ్రనాయకుడు లాల్ కృష్ణ అద్వాణీ అయినా అటల్ బిహారీ వాజపేయి విదేశాంగ మంత్రిగా, ఆ తరవాత ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పలస్తీనా ప్రజల ఆకాంక్షలకు మద్దతు ఇవ్వడం మాత్రం మానలేదు. ఐక్యరాజ్యసమితి వేదికలమీద వాజపేయి ఎప్పుడు మాట్లాడినా పలస్తీనాకు మద్దతుగా నిలవడం మానుకోలేదు. మన విదేశాంగ విధానంలో ఉన్న నిరంతరతను ఆయన గౌరవించకుండా ఉండలేదు. మోదీ మాటల్లో మాత్రం తేడా ఉంది. విదేశాంగ మంత్రిత్వశాఖ వెల్లడిస్తున్న లేదా అధికారికంగా విడుదల చేస్తున్న ప్రకటనల్లో మాత్రం పలస్తీనా విషయంలో మార్పేమీ లేదని నొక్కి చెప్తున్నారు. ఈ వైరుధ్యం ఇంతకు ముందెప్పుడూ లేదు. మోదీ తొందరపడి ఇజ్రాయిల్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించారనీ అనుకోలేం. అది విదేశాంగ విధానంలో మార్పుకు సంకేతం అనుకోవడానికీ వీలు లేదు. ప్రధానమంత్రి హోదాలో ఉన్నవారు వ్యక్తిగతంగా అభిప్రాయాలు వ్యక్తంచేసే ఆనవాయితీ కనిపించవచ్చు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాత్రం ఈ విధానాన్ని పూర్తిగా తిరగతోడారు. హమాస్ ఇజ్రాయిల్ మీద రాకెట్ల వర్షం కురిపించిన రోజునే ఇజ్రాయిల్ కు బేషరతుగా మద్దతిచ్చారు. "ఇజ్రాయిల్ పై తీవ్రవాద దాడి దిగ్భ్రాంతికి గురి చేసింది. బలైపోయిన అమాయక ప్రజలకు, వారి కుటుంబాలకే మా మద్దతు, ప్రార్థనలు ఉంటాయి. ఈ క్లిష్ట సమయంలో మేం ఇజ్రాయిల్‌కు అండగా ఉంటాం" అని మోదీ ట్విట్టర్ (ప్రస్తుతం "ఎక్స్") లో ఓ సందేశం పెట్టారు. ఈ మధ్య కాలంలో ప్రధాని, ఇతర మంత్రుల విధాన ప్రకటనలకు కూడా ట్విట్టర్ లాంటి సామాజిక మాధ్యమ ఉపకరణాలు వేదికలు కావడం విచిత్రం. ఇజ్రాయిల్ కు పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నామని మోదీ అధికారికంగా ప్రకటన జారీ చేయలేదు. కానీ ఆయన ట్విట్టర్ సందేశాన్నే భారత విధానం కింద ప్రపంచం మొత్తం భావిస్తోంది. ప్రధానమంత్రి హమాస్ పేరెత్తకపోయినా ఆ దాడులకు తీవ్రవాద ముద్రవేసేశారు. హమాస్ దాడి ఎంత కిరాతకమైంది అయినా ఆ సంస్థను భారత్ అధికారికంగా తీవ్రవాద సంస్థగా భావిస్తోందా అన్న ప్రశ్నకు ప్రభుత్వ వర్గాల నుంచి వివరణ ఏదీలేదు. ఏడు దశాబ్దాలుగా ఇజ్రాయిల్ పలస్తీనియన్లను పైశాచికంగా అణచివేయకపోతే హమాస్ తీవ్రవాద వైఖరి అనుసరించేదా అన్నది అసలు ప్రశ్న. పైగా మొన్నమొన్నటి దాకా హమాస్ ను మిలిటెంట్ సంస్థ అనే అన్నారు కానీ తీవ్రవాద ముద్ర వేయలేదు. హమాస్ అర్థరహిత దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయిల్ యుద్ధం పేరిట కొనసాగిస్తున్న మారణకాండకన్నా తీవ్రవాదం ఎక్కడైనా ఉంటుందా? గాజాచుట్టూ మూడు లక్షలకు పైగా సైనికులను మోహరించి ఆ ప్రాంతం మీద తెరిపి లేకుండా బాంబుల వర్షం కురిపిస్తూ వేలాది మంది అమాయకులను అంతమొందిస్తున్న ఇజ్రాయిల్‌ది తీవ్రవాదం కాదనుకుంటే ప్రపంచంలో ఏదీ తీవ్రవాదం కావడానికి అవకాశమే ఉండదు. పది లక్షల మంది 24 గంటలలోగా గాజా సరిహద్దు నుంచి 20 కిలోమీటర్ల లోపలికి వెళ్లిపోవాలని ఆదేశించడంకన్నా తీవ్రవాదం ఎక్కడుంటుంది? యుద్ధం ప్రారంభించిన రోజునుంచే గాజా ప్రాంతానికి ఆహార పదార్థాలు, విద్యుత్తు, ఇంధన సరఫరా లేకుండా చేసి అక్కడి ప్రజలను మల మల మాడ్చడానికి, హింసించడానికి మించిన తీవ్రవాదాన్ని ఊహించడం కూడా సాధ్యం కాదు. ఇవేవీ మోదీ దృష్టిలో తీవ్రవాద చర్యలు కావు. అంటే ఆయన హమాస్ ను తీవ్రవాద సంస్థగా పరిగణించడం అంటే వారి దుశ్చర్యలను తప్పు పట్టడాన్ని మించిన కారణం ఏదో ఉండి ఉండాలి. పలస్తీనియన్లు ముస్లింలని, మన దేశంలో నవంబర్ మొదటి వారం నుంచి అయిదు రాష్ట్రాల శాసన సభల ఎన్నికలు జరగనున్నాయని ఆ తరవాత నాలుగు నెలల్లోగా సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉందని గుర్తు చేసుకుంటే మోదీ ఆక్రోశం వెనక ఆంతర్యం పొడకడ్తుంది. సార్వభౌమాధికారం గల పలస్తీనా రాజ్యం ఏర్పాటు చేయాలని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం విస్పష్టమైన ప్రకటన జారీ చేసింది. మోదీ వ్యాఖ్యలు ట్విట్టర్ లో చేసినవి కనక, ఆయన వెల్లడించిన అభిప్రాయాలు మన విదేశాంగ విధానంలో భాగమని అధికారికంగా ప్రకటించనందువల్ల విదేశాంగ మంత్రిత్వ శాఖ పలస్తీనా రాజ్యానికి మద్దతు పలకడమే మన విదేశాంగ విధానం అనుకోవాలి. మానవతా సూత్రాలను పాటించడం "విధి" అని కూడా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందం బాగ్చీ వారం వారం ఏర్పాటుచేసే పత్రికా విలేకరుల సమావేశంలో విస్పష్టంగా ప్రకటించారు. యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రాంతంలో తాజా పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని కూడా ఆయన అన్నారు. విదేశాంగ మంత్రి గురువారం తాజా పరిస్థితిని సమీక్షించిన తరవాతే బాగ్చీ మీడియా సమావేశం నిర్వహించారంటే అది అధికారిక విధానమే అవుతుంది. "సార్వభౌమాధికారంగల, స్వతంత్రమైన, మనగలిగిన పలస్తీనా ఏర్పాటు కోసం ప్రత్యక్ష చర్చలు జరగాలని ఇండియా ఎప్పుడూ కోరుతోంది. పలస్తీనా ప్రజలకు నిర్దిష్ట సరిహద్దులు ఉండాలి. ఇజ్రాయిల్ సరసన మనగలిగే అవకాశం ఉండాలి" అని బాగ్చీ తెలియజేశారు. పలస్తీనా గురించి భారత్ వైఖరి దీర్ఘ కాలికమైందని, నిలకడగా ఉన్నదని కూడా ఆయన స్పష్టంగా చెప్పారు. ఈ విధానంలో ఎలాంటి మార్పు లేదని నొక్కి చెప్పారు. ప్రస్తుతం ఇజ్రాయిల్, ఆ పరిసర ప్రాంతాలలో పరిస్థితి ఎప్పటికప్పుడు మారుతోందని కూడా ఆయన అన్నారు. హమాస్‌ను భారత్ తీవ్రవాద సంస్థగా పరిగణిస్తోందా అన్న ప్రశ్నకు మాత్రం బాగ్చీ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. అది తీవ్రవాద సంస్థ అవునో కాదో నిర్ధారించవలసింది ప్రభుత్వంలోని ఇతర విభాగాలు అని నేరుగా సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. అంటే హమాస్ ను అధికారికంగా తీవ్రవాద సంస్థగా ఇప్పటికి పరిగణించడంలేదని తేలిపోతూనే ఉంది. శనివారం ఇజ్రాయిల్ మీద హమాస్ భారీ ఎత్తున రాకెట్లు ప్రయోగించినప్పటి నుంచి పశ్చిమాసియాలో పరిస్థితి గురించి విదేశాంగ మంత్రిత్వశాఖ అధికారికంగా భారత్ వైఖరి తెలియజేయడం ఇదే మొదటి సారి. దౌత్యపరమైన అంశాలకు సంబంధించి వివిధ పక్షాలతో నిరంతరం సంప్రదిస్తూనే ఉంటామని బాగ్చీ అన్నారు. వివిధ స్థాయుల్లో ఈ సంవాదం కొనసాగుతుందని అన్నారు. దీన్నిబట్టి మోదీ ట్విట్టర్‌లో చేసిన వ్యాఖ్యలు ఒక మతవర్గం వారిపై ద్వేషం రెచ్చగొట్టే చౌకబారుయత్నాల్లో భాగం మాత్రమేనని, విదేశాంగశాఖ ప్రకటనే విదేశాంగ నీతికి నిర్వచనం అని అనుకోవాలి.

దిగజారిన భారత ఆకలి సూచీ

జనక మోహన రావు దుంగ

మన దేశంలో ప్రపంచ కుబేరులూ, ఆకలితో అలమటిస్తున్న పేదలూ ఉన్నారు. ఆకలి అనేది సాధారణ ప్రపంచ ఆకలి సూచీ 2023 తాజా నివేదిక విడుదలైంది. ఇది కన్సర్న్ వరల్డ్‌వైడ్ వెల్తుంగర్‌హిల్ఫ్ అనే ప్రభుత్వేతర సంస్థలు ఆకలి సూచీని అంచనా వేశాయి. ఈ నివేదికలో వివిధ దేశాల ప్రజల ఆకలి స్థాయిని స్కోర్ రూపంలో తెలియజేసాయి. ఈ స్కోర్ నాలుగు సూచికలపై ఆధారపడి లెక్కిస్తారు. ఒకటి పోషకాహార లోపం, రెండు చైల్డ్ స్టంటింగ్ (ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో వయస్సుకు తగ్గ ఎత్తులేకపోవడం), మూడు పిల్లల వృధా (వేస్టింగ్-ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం), పిల్లల మరణాలు (ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణం). ఈ స్కోర్ 100 పాయింట్ల స్కేలుని కలిగి ఉంది. ఈ స్కోర్ 9.9 కంటే తక్కువ ఉంటే తక్కువ స్థాయి అని, 10 నుండి 19.9 మధ్యన ఉంటే మధ్యస్థం అని, 20 నుండి 34.9 మధ్యన ఉంటే తీవ్రమైన స్థితి అని, 35 నుండి 49.9 మధ్యన ఉంటే ఆందోళనకరమైన స్థితి అని , 50 కంటే ఎక్కువ ఉంటే అక్కడ ప్రజలు భయంకరమైన స్థితిలో ఆకలి స్థాయిలను కలిగి ఉన్నారని అర్థం.

సహారా దక్షిణాసియా, ఆఫ్రికా దక్షిణ ప్రాంతాలు 27.0 జి.హెచ్.ఐ స్కోర్‌తో అత్యధిక ఆకలి స్థాయిలను కలిగిఉన్న ప్రపంచ ప్రాంతాలుగా, పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా జి.హెచ్.ఐ 11.9స్కోర్‌తో సాధారణమైన ఆకలిస్థాయిని సూచిస్తూ మూడవ-అత్యధిక ఆకలిస్థాయిని కలిగిఉన్న ప్రాంతంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ స్కోర్ 2015లో 19.1 ఉండగా, 2023లో ఒక పాయింట్ తగ్గి 18.3గా ఉంది. 2000 సం.లో 7 దేశాలు భయంకరమైన ఆకలిస్థాయిలో ఉండేవి. ఇదే సంవత్సరంలోనే 31దేశాలు ఆందోళనకరమైన, 29 దేశాలు తీవ్రమైన, 36 దేశాలు మధ్యస్థ, 19 దేశాలు తక్కువ ఆకలిస్థితిలో ఉండగా 2023 సం. వచ్చేసరికి ఈ ఆకలిస్థాయిలు వరుసగా 9 దేశాలు, 34దేశాలు, 37 దేశాలు, 50 దేశాలుగా ఉన్నాయి. పోషకాహారలోపం ప్రాబల్యం 2017లో 57.2 కోట్ల నుండి సుమారు 73.5 కోట్లకు పెరిగింది.

మన దేశంలో ఆకలి స్థాయులు :

స్కోర్ 2000 లో 38.4 నుండి 2008లో 35.5, 2015లో 29.2కి మెరుగుపడింది. గత ఎనిమిదేళ్లలో, దేశంలో కేవలం జిహెచ్‌ఐ 0.5 పాయింట్లు మాత్రమే పెరిగింది. ప్రపంచ ఆకలి సూచీ-2023లో మొత్తం 125 దేశాలలో భారతదేశం 111వ స్థానంలో ఉంది. తైమూర్-లెస్టే, మొజాంబిక్, అఫ్ఘానిస్తాన్, హైతీ, గినియా-బిస్సావు, లైబీరియా, సియెర్రా లియోన్, నైజర్, లెసోతో, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, యెమెన్, మడగాస్కర్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, దక్షిణ సూడాన్, బురుండి,సోమాలియా దేశాలు మనకంటే అధ్వాన్నంగా ఉన్నాయి. పొరుగు దేశాలైన పాకిస్థాన్ (102), బంగ్లాదేశ్ (81), నేపాల్ (69), శ్రీలంక (60) తర్వాత మన దేశం ఉండటం గమనార్హం. 2022లో మనదేశం 107వ స్థానంలో ఉండేది.

మన దేశంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు :

కుంగిపోవడం, పోషకాహారలోపం, రక్తహీనత (చిన్నపిల్లలు, మహిళలు మరియు కౌమారదశలో ఉన్న బాలికలలో) తగ్గించడం లక్ష్యంతో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ 2018లో పోషణ అభియాన్ ప్రారంభించింది. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ద్వారా అమలుచేసిన కేంద్ర ప్రాయోజిత పథకం, ప్రసూతి ప్రయోజన కార్యక్రమమైన ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం, కీలకమైన విటమిన్లు, ఐరన్, అయోడిన్, జింక్ వంటి ఖనిజాలు, ఎ, డి విటమిన్లతో మెరుగుపరిచిన ఫుడ్ ఫోర్టిఫికేషన్ లేదా ఫుడ్ ఎన్‌రిచ్‌మెంట్ పథకం, 75శాతం గ్రామీణ జనాభాకు, 50శాతం పట్టణ జనాభాకు లక్షిత ప్రజాపంపిణీ వ్యవస్థకింద సబ్సిడీ ఆహార ధాన్యాలను పొందేందుకు చట్టబద్ధంగా జాతీయ ఆహార భద్రతాచట్టం 2013, 12 వ్యాధులు నివారించే టీకా మిషన్ ఇంద్రధనుష్ పథకాలను మనదేశం అమలు పరుస్తోంది.

ఫోన్: 8247045230

తూతూ మంత్రంగా భూ సంస్కరణలు

బొల్లిముంత సాంబశివరావు

భూమికి, పేదరికానికి అవినావభావం సంబంధం ఉంది. భారత దేశంలో సుదీర్ఘకాలం భూస్వామ్య వ్యవస్థ కొనసాగింది. వలసపాలనలో కూడా అనేక ప్రాంతాల్లో రాజరిక వ్యవస్థ పాలనసాగింది. ఈ వ్యవస్థలో జమీందార్ల, జాగీర్దార్ల ఆధీనంలో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. అధికార మార్పిడి తర్వాత కూడా సంస్థానాలు కొంతకాలం కొనసాగాయి. భూస్వామ్య వ్యవస్థ రద్దుకు అధికారం చేపట్టిన భారత పాలకులు మౌలిక సంస్కరణలు అమలు జరపలేదు. బ్రిటిష్ వలస పాలన కాలంలోనే భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా భూ పోరాటాలు అనేక ప్రాంతాల్లో ప్రారంభమైనాయి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానసాగిన తెలంగాణ పోరాటం సాయుధ ప్రతిఘటనా పోరాట స్థాయికిచేరింది. 10లక్షల ఎకరాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రపుల్లవాయలర్ రైతాంగం కూడా భూముల ఆక్రమణ ప్రారంభించారు. ఇలాంటి పోరాటాలే అనేక ప్రాంతాలకు విస్తరించాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఫ్యూడల్ వ్యవస్థ పునాదులనే కదిలించివేసింది.

దేశంలో భూసంస్కరణలు తీసుకు రావాల్సిన అవసరాన్ని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్39 తెలియచేస్తున్నది. రాష్ట్ర శాసనసభ సభలకు మాత్రమే భూ సంస్కరణల చట్టాలు రూపొందించి అమలుజరిపే అధికారం ఉంటుందని కూడా చెప్పింది. రైతాంగ పోరాటాల ఫలితంగా 1961-62 నాటికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భూ సీలింగ్ చట్టాలు ఆమోదం పొందాయి. సీలింగ్ పరిమితిలో రాష్ట్రానికి-రాష్ట్రానికి మధ్య తేడాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రాల్లో ఒకే విధంగా సీలింగ్ తీసుకుని రావటానికి 1972లో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో కొత్త సీలింగ్ విధానాన్ని రూపొందించారు. భూమి రకం, దాని ఉత్పాదకత ఇతర కారణాలపై ఆధారపడి ప్రాంతాన్నిబట్టి భూ సీలింగ్ పరిమితులకు జాతీయ మార్గదర్శకాలు జారీ అయ్యాయి. మొదటి రకం భూమి 10-18 ఎకరాలు, రెండవ రకం భూమి 18-27ఎకరాలు, కొండ, ఎడారి ప్రాంతాల్లో 27-54 ఎకరాలు సీలింగ్‌గా ప్రకటించారు.దేశంలో 1961-72 మధ్యలో మిగులు భూమి 23 లక్షలగా ప్రకటించారు. జాతీయస్థాయిలో ఒకే సీలింగ్ విధానం రూపొందించిన తర్వాత 67లక్షల ఎకరాలుగా మిగులు భూమిని ప్రకటించారు. ప్రభుత్వ విధానాలు, పాలసీపై పరిశోధన, శిక్షణల నిమిత్తం ఏర్పాటైన లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీ ఆఫ్ ఎడ్మినిస్ట్రేషన్ అంచనా ప్రకారం, సీలింగ్‌లో పోగా దేశం మొత్తం మీద మిగులుభూమి రమారమి 5కోట్ల 20 లక్షల ఎకరాలు ఉంటాయని అంచనా వేసింది. పాలకులు ప్రకటించిన 67 లక్షల ఎకరాల్లో 20లక్షల 33 వేల ఎకరాలను స్వాధీనం చేసుకుని 10 లక్షల 90 వేల ఎకరాలను 50లక్షల కుటుంబాలకు పంపిణీ చేసినట్లు జాతీయ భూ సంస్కరణల కౌన్సిల్ 2008 జనవరిలో పేర్కొన్నది. దీన్ని గమనిస్తే ప్రకటించిన మిగులు భూమిలో 11 లక్షల ఎకరాలలోపు మాత్రమే పేదలకు పంపిణీ జరిగింది. దేశంలో 15కోట్ల 50లక్షల సాగు భూములు ఉంటే 67లక్షలు మాత్రమే మిగులుభూమి ప్రకటించటం, అందులోను 11లక్షల ఎకరాలు మాత్రమే పంపిణీ జరిగిందంటే భూ సంస్కరణలు ఎంత బూటకంగా మారాయో అర్థమౌతుంది. అందుకు కారణం శాసనసభల్లో భూస్వామ్యవర్గ ప్రతినిధులు ఎక్కువగా ఉండటం, ప్రభుత్వాలు కూడా భూస్వామ్యవర్గ ప్రయోజనాలు కాపాడేవి కావటమే. పంపిణీఅయిన దాంట్లో కూడా సేద్యానికి నిరుపయోగమైన భూములే ఎక్కువగా ఉన్నాయి. జమ్ము-కశ్మీర్‌లో పూర్తిగా భూ సంస్కరణలు అమలుకాగా, పశ్చిమ బెంగాల్, కేరళలో కొంతమేర భూ పంపిణీ జరిగింది.

భూ సంస్కరణల చట్టాలేవీ భూస్వామ్య వ్యవస్థలో మౌలికమైన మార్పులు తీసుకురాలేకపోయాయి. ఫలితంగా భూ కేంద్రీకరణ కొనసాగుతూనే ఉన్నది. 2020 జాతీయ శాంపిల్ సర్వే ప్రకారం 84శాతం ఉన్న సన్న కారు రైతులు హెక్టార్ కంటే తక్కువభూమి కలిగి ఉన్నారు. వీరి చేతుల్లో ఉన్న మొత్తం భూమి 47.3శాతం ఉంది. 13.8శాతం ఉన్న ధనిక రైతాంగం పంట భూమిలో 47శాతంపైగా కలిగి ఉన్నారు. రాష్ట్రాలవారీగాను తేడాలున్నాయి. పంజాబ్, బిహార్ రాష్ట్రాల్లో 10శాతంగా ఉన్న భూస్వాముల వద్ద 80శాతం భూమి ఉంది. తెలంగాణ, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో 55శాతం భూమి 10శాతం భూకామాందుల వద్ద ఉంది. దేశంలో కేవలం 4.9శాతం ఉన్న ధనిక రైతాంగం 32శాతం భూమిని నియంత్రిస్తున్నారు. భారతదేశంలో ఒక పెద్ద భూకామందు ఒక సన్నకారురైతు కంటే 45 రెట్లు భూమి కలిగి ఉన్నాడు. సెజ్‌లపేరుతో ప్రభుత్వం కొత్తగా భూ ఎస్టేట్ దారులను సృష్టింది. రైతుల భూములను వీరికి కట్టబెడుతున్నది. ఫలితంగా భూ పంపిణీ తిరోగమనంలో సాగుతున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భూ సంస్కరణలచట్టం అమలు 1973లో అమల్లోకి వచ్చింది. చట్ట ప్రకారం మొదట 18 లక్షల ఎకరాలు మిగుల భూమిగా ప్రకటించింది ప్రభుత్వం. దాన్ని సవరించి 7.9 లక్షల ఎకరాలకు కుదించారు. అందులో కూడా 6.47లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని, 5.82 లక్షల ఎకరాలను లక్షా, 79 వేల మందికి పంపిణీ చేసినట్లు పాలకులు ప్రకటించారు. సీలింగ్ కింద స్వాధీనం చేసుకున్న భూస్వాముల భూములు వేళ్ల మీద లెక్కించవచ్చు. చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని తమ భూములను భూస్వాములు కాపాడుకున్నారు. కొన్ని పార్టీలు, వ్యక్తులు చెబుతున్నట్లుగా భూ కేంద్రీకరణ తగ్గలేదని, అది కొనసాగుతూనే ఉందని, అర్ధ భూస్వామ్య విధానం గ్రామీణ జీవితాన్ని శాసిస్తున్నదని ప్రభుత్వ సంస్థలే వెల్లడిస్తున్నాయి. దేశంలో పేదరికానికి భూమి లేకపోవటం కారణంగా ఉందని అనేక సూచికలు తెలియచేస్తున్నాయి. భారతదేశంలో గ్రామీణ ప్రాంతంలో పేదరికం 25.7శాతం కాగా, పట్టణ ప్రాంతంలో 13.7శాతం ఉన్నట్లు ప్రభుత్వ సర్వేలు వెల్లడిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలనచేస్తే పేదరికం ఇంకా పెరుగుతోంది. పొలిటికల్ టైమ్స్ ఆఫ్ ఇండియా (2008) కథనం ప్రకారం భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో గ్రామీణ పేదలు, భూమిలేని కుటుంబాలు ఉన్నాయి. వాస్తవాలను పరిశీలిస్తే భూసంస్కరణలవల్ల పేదలకు భూములు లభించలేదని, భూ కేంద్రీకరణలో మౌలికమార్పు రాలేదని, కౌలుదారీ చట్టాలవలన కౌలు హక్కులు లభించకపోగా అత్యధికమంది కౌలుదారులను తొలగించారు. పేదలకు భూమి లభించాలన్నా, భూమిపై కౌలు హక్కులు ఏర్పడాలన్నా యావన్మంది గ్రామీణ పేదలు సమైక్యంగా ఉద్యమించాలి.

సెల్: 9885983526

దశహరాకు వక్ర భాష్యాలు ఆపండి!



డాక్టర్ దేవరాజు మహారాజు

దశ-హరా-దశరా (దసరా) అంటే పది మంది ఓడిపోయారని అర్థం. హరించుకు పోయారని కూడా చెప్పుకోవచ్చు. ఎవరు ఆ పదిమందీ? అసలు విషయం చెప్పకుండా దశకంఠుడనే రావణుడు చనిపోయాడు గనుక, ఇది దశహరా అని చెప్తారు. రావణుడు రామాయణంలో ఓ కల్పిత పాత్ర. రాముడు ఎలాగైతే ఓ కల్పిత పాత్రో రావణుడు కూడా అలాగే ఓ కల్పిత పాత్ర. ఒక కావ్యంలో ఒక పాత్ర చనిపోతే పండగలేమిటీ? అర్థం లేకుండా? దాని ఆధారంగా రావణుడి ప్రతిమను పెద్దఎత్తున తగలబెట్టడం కొందరు చేస్తే, దానికి విరుద్ధంగా రాముడి ప్రతిమను మరికొందరు తగలబెడుతున్నారు. వీటికి పైగా, రావణ్‌లీలా/రామ్‌లీలా అని పేర్లు పెట్టుకోవడం అవసరమా? భ్రమల్లో బతికే వారికి బాగా ఉంటుందేమోగానీ, వాస్తవాలు తెలుసుకోదలుచుకుంటే అవి వేరే విధంగా ఉంటాయి.

ఈ దేశంలో మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించింది చంద్రగుప్త మౌర్యుడు. ఆయనే ఆ వంశంలో మొదటి రాజు. అలాగే చివరి రాజు బృహదత్తుమౌర్య. వీరి మధ్య మొత్తం పది మంది మౌర్య సామ్రాజ్యాన్ని పరిపాలించారు. ఇక్కడ చివరి రాజు బృహదత్తుడి దగ్గర మోసపూరితంగా ఒక బ్రాహ్మణుడు సైన్యాధ్యక్షుడయ్యాడు. అతని పేరు పుష్యమిత్ర శృంగుడు. అదను చూసి, పుష్యమిత్రుడు రాజు బృహదత్తు మౌర్యను హత్య చేస్తాడు. దానితో పది తరాలుగా వస్తున్న మౌర్యవంశం-వారి సామ్రాజ్యం పతనమయ్యాయి. అసలు దశహరా అంటే ఇది. దీన్ని కప్పిపుచ్చడానికి పదితలలున్న రాక్షస రాజును సృష్టించి కథలు అల్లారు. పదితరాలుగా వస్తున్న మౌర్యవంశం పతనమైందనీ, తమ శృంగుల రాజ్యం స్థాపించబడిందని పుష్యమిత్ర శృంగుడు తన బ్రాహ్మణ వర్గీయులతో చేసుకున్న విజయోత్సవమే దశహరా. మౌర్య చక్రవర్తులంతా బౌద్ధాన్ని అనుసరించిన వారు. మౌర్యుల కాలంలో బ్రాహ్మణుల్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. శ్రాద్ధకర్మలు ఉండేవి కావు. హింసాత్మకంగా బలులు ఇచ్చేవారు కాదు. విగ్రహారాధన, పూజలు, అర్చనలు ఉండేవి కావు. ఒళ్ళు వంచి కష్టపడి పనిచేయడం చేతకాని బ్రాహ్మణులకు గడ్డుకాలం దాపురించింది. ఎలాగైనా బౌద్ధాన్ని నాశనం చేయాలి. మౌర్య సామ్రాజ్యాన్ని పడగొట్టాలి. తమ వైదిక ధర్మాన్ని పునరుద్ధరించుకోవాలి... కూర్చుని తింటూ ఉండాలి! అని కుట్రలకు, కుతంత్రాలకు పూనుకున్నారు. హింసకు కూడా వెనుకాడ లేదు. రాజు పుష్యమిత్ర శృంగుడు-బౌద్ధ భిక్షువుల తలలు నరికి తెమ్మన్నాడు. ఒక్కొక్క తలకు వంద వరహాలిస్తానని కూడా ప్రకటించాడు. ఇకనేం? బౌద్ధ భిక్షువులు దొరికిన వారు దొరికారు. లెక్కలేనంతమందిని నరికి చంపారు. కొందరు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇతర ప్రాంతాలకు పారిపొయ్యారు.

దసరా రోజు జమ్మి చెట్టును దర్శించి, దాని ఆకు తీసుకుని బంధుమిత్రుల్ని కలవడం ఆచారంగా వస్తోంది. దానికి చెప్పిన కథ ఏమిటీ? మహాభారతంలో పాండవులు తమ ఆయుధాలు జమ్మిచెట్టు మీద పెట్టారని, అవి ఇతరులకు శవం లాగా కనిపిస్తాయని చెపుతారు. అవి తీసుకుని, మహాభారత సంగ్రామానికి పాండవులు బయలుదేరి వెళ్ళారని చెపుతారు.

పుష్యమిత్ర శృంగుడు

అసలు చెట్టు మీద శవం కనబడితే ఎవడూ పైకెక్కి ఏమిటా అని చూడడా ? ఆనాటి ఆ ప్రజలు అంత పిరికివారా? సరే. ఆ విషయం వదిలేద్దాం. దశహరా అని ఒకటి రామాయణం కథ చెప్పారు. మరొకటి భారతం లోది చెప్పారు. అంటే ముక్కలు ముక్కలుగా అతుకుల బొంతలాంటి కథలు చెప్పడమేనా మనువాదుల పనీ? సరే- దాని గూర్చిన వాస్తవాలేమిటి? చరిత్ర ఏం చెపుతుందో చూద్దాం. మొదట క్రూరుడిగా ఉన్న అశోకుడు కళింగను ఆక్రమించుకోవడానికి అతి భీభత్సంగా యుద్ధం చేశాడు. ఆ యుద్ధం అతనిలో గొప్ప మార్పు తెచ్చింది. అంతర్మథనానికి లోనయ్యాడు. యుద్ధంతో మానవాళికి జరిగిన నష్టాన్ని బేరీజు వేసుకున్నాడు. బుద్ధుడి బోధనలకు ఆకర్షితుడయ్యాడు. ఫలితంగా యుద్ధం ముగిసిన పదిరోజుల తర్వాత సరిగ్గా దశమి రోజున బౌద్ధ ధమ్మ దీక్ష స్వీకరించాడు. విజయం సాధించినందుకు ఆ దశమి విజయ దశమి అయింది. ఆ రోజు తన రాజ్యమంతా విజయోత్సవాలు, వేడుకలు చేసుకోవాలి. కాని, అందుకు భిన్నంగా అదే దశమి రోజున బుద్ధ విగ్రహం పాదాల దగ్గర తన ఆయుధాలు పెట్టి అశోకుడు అహింసా సిద్ధాంతాన్ని స్వీకరించాడు. బౌద్ధ గురువు మొగలి పుత్త తిస్స ఆధ్వర్యంలో ఆ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా బౌద్ధం వ్యాపించడానికి అశోకుడు చేసిన విశేషమైన కృషి ఏమిటో మనకు తెలుసు. దేశవ్యాప్తంగానూ, విదేశాల్లోనూ ఉన్న బౌద్ధ విగ్రహాలు, స్థూపాలు, ఆరామాలే ఆనాటి వాస్తవాల్ని ఈ నాటికీ వివరిస్తూనే ఉన్నాయి. అసలు విజయ దశమి రోజున జరిగింది ఇదయితే- వైదిక సంప్రదాయ వాదులేం చేస్తున్నారూ? రక్తం తాగుతున్న దేవతా స్త్రీ మూర్తిని పెట్టుకుని, దానికి ఎదురుగా జంతువుల్ని బల ఇస్తున్నారు. ఆ దేవతామూర్తి చేతిలో కూడా ఖడ్గం ఉంటుంది. అది రక్తసిక్తమైందన్నట్టుగా ఆ బొమ్మ ఖడ్గానికి కూడా ఎరుపు రంగు పూస్తారు. అంటే హింసను ప్రేరేపించడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారన్న మాట! గొర్రెపిల్ల మెడను ఒకడు పంటితో కొరికి చంపడం, ఆ రక్తంతో దేవతా మూర్తులకు అభిషేకాలు చేయడం ఇప్పటికీ కొనసాగుతున్న ఆచారాలు. ఇలాంటివి ఇంకా అవసరమా ? అని జనం ఆలోచించాలి కదా? మనం అర్థం చేసుకోవాల్సింది. ఏమంటే - "శాంతిని బోధిస్తున్న బౌద్ధానికి వ్యతిరేకంగా బ్రాహ్మనిజం చేస్తున్నదే ఈ "విజయదశమి"- అని!

బౌద్ధాన్ని నాశనం చేయడానికి చేసిన ఎన్నో కుతంత్రాలలో భాగమే మనుస్మృతి రచన! దాని ప్రకారమే రాజును, రాజ్యాన్ని తమ చెప్పు చేతలలో ఉంచుకుని తమ స్థానాన్ని రాజగురు స్థానంలో లేదా పండిత పూజారి స్థానాల్లో మహోన్నతంగా స్థిరపరుచుకున్నారు-వైదిక మతాచార్యులు! మిగతా వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తూ వారి రెక్కల కష్టాన్ని దోచుకుతింటూ శతాబ్దాలుగా కాలం గడుపుతూ వస్తున్నారు. ఈ విషయాలు పూర్తిగా అర్థంచేసుకున్న డా. బి.ఆర్.అంబేద్కర్ ఎవరూ ఊహించని నిర్ణయం తీసుకున్నారు. ఈ దేశాన్ని మౌర్యులు, నాగ వంశ పాలకులు పరిపాలించారు. ఈ నాగజాతిని కాపాడింది బుద్ధుడే. వారే ప్రపంచవ్యాప్తంగా బౌద్ధాన్ని ప్రచారం చేశారు. నాగజాతి వారు ఎక్కువ సంఖ్యలో ఉన్న ప్రాంతం నాగాపూర్. అక్కడ ప్రవహించే నది నాగానది. ఇలాంటి చారిత్రక అంశాలు క్షుణ్ణంగా పరిశీలించి, పరిశోధించిన తర్వాత డా.అంబేద్కర్ 1956 లో అక్టోబర్ 14న దీక్షభూమి, నాగ్‌పూర్ విజయదశమి రోజు బౌద్ధం స్వీకరించారు. అంటరానితనం అంతరించాలనీ, మనుషులందరికీ సమాన స్థాయి, హక్కులు ఉండాలన్నది ప్రధానంగా ఆయన కోరుకున్నారు. ఆయన స్వీకరించడమే కాకుండా, ఆయన అనుయాయుల్ని ఆరులక్షల మందిని బౌద్ధంలోకి తీసుకుపోయారు. ఈ కార్యక్రమమంతా భదంత్ చంద్రమణి మహా థేరో, భంతేప్రజ్ఞా తిస్స, యం.సంఘ రతన్ మహా థేరో ఇంకా ఇతర బౌద్ధ భిక్షుల ఆధ్వర్యంలో జరిగింది. అంబేద్కర్ మరణం తర్వాత కూడా అధిక సంఖ్యలో ఆయన అనుచరులు బౌద్ధం స్వీకరిస్తూ వచ్చారు. బౌద్ధానికి ఈ దేశంలో ఒకప్పుడు ఉన్న ఆదరణ ప్రస్తుతం లేకపోవచ్చు. కానీ, ఆధునిక కాలంలో కూడా అంతరించి పోకుండా స్థిరంగా కొనసాగుతూ ఉంది. మతాల పేరుతో రాజకీయ నాయకులు చేస్తున్న దుశ్చర్యలకు విసిగిపోయి మానవ వాదులంతా బౌద్ధంవైపు ఆకర్షితులవుతున్నారు. అధికారికంగా బౌద్ధం స్వీకరించకపోయినా, తమ ఆలోచనా ధోరణిలో బుద్ధుడి బోధనల్ని బలంగా నిలుపుకుంటున్నారు. వైజ్ఞానిక స్పృహ కోసం తహతహలాడుతున్న హేతువాదులంతా బుద్ధుడి బోధనలకు ప్రభావితులవుతున్నారు. ఒక చారిత్రక పురుషుడి ప్రభావంలో ప్రపంచం ఇంతగా పడిందంటే - ఇంకా పడుతూనే ఉందంటే అది మామూలు విషయంకాదు. కొన్ని దేశాల్లో మత కేంద్రాల్ని, ప్రార్థనాస్థలాల్ని మూసేసి హోటళ్ళకు, క్లబ్బులకు అద్దెకు ఇస్తున్నారు. మత రహితులుగా బతకాలనుకుంటున్నారు. బ్రాహ్మనిజం సమాజంలో అసమానత్వాన్ని ప్రభోదిస్తే, బౌద్ధం సమానత్వం కోసం పాటుపడింది. అందువల్ల మానవీయ విలువలకు ప్రాధాన్యమిచ్చే వారంతా ఈ వైపుకు రావడం తథ్యం!

కేంద్ర సాహిత్య అకాడెమి విజేత, జీవశాస్త్రవేత్త

ఫలించిన 28 ఏళ్ల పోరాటం

సుప్రీం ఆదేశాలతో 50వ ఏట ఉద్యోగం

న్యూదిల్లీ: ఒక వ్యక్తి 28 ఏళ్ల పోరాటం ఫలించి సుప్రీంకోర్టు ఆదేశాలతో 50వ ఏట ఉద్యోగం పొందాడు. తపాలా శాఖ లో ఉద్యోగానికి దరఖాస్తు చేసిన ఒక వ్యక్తి ఎంపిక ప్రక్రియలో విజయం సాధించినా ఉద్యోగంలో చేరేందుకు దాదాపు మూడు దశాబ్దాల పాటు పోరాటం చేయాల్సి వచ్చింది. చివరకు సుప్రీంకోర్టు ఉత్తర్వులతో 50వ ఏట ఆయనకు ఆ ఉద్యోగం దక్కింది. అయనను అనర్హుడిగా ప్రకటించడంలో తపాలా శాఖ పొరబాటు ఉందని అత్యున్నత న్యాయస్థానం గుర్తించింది. ఆయనను వెంటనే పోస్టల్ అసిస్టెంట్‌గా నియమించాలని తపాలా శాఖను ఆదేశించింది. ఇందుకు సంబంధించి వివరాలిలావున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ పోస్టల్ డివిజన్‌లో 10 పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు 1995లో రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. యూపీకి చెందిన అంకుర్ గుప్తా దరఖాస్తు చేసుకోగా ఆయనను ఎంపిక చేసి మెరిట్ లిస్ట్‌లో పేరు ప్రకటించారు. ఈ క్రమంలోనే అంకుర్ సహా మెరిట్ జాబితాలో ఉన్నవారిని లఖింపూర్ ఖేరీ పోస్ట్ ఆఫీసులో 15 రోజుల పాటు ప్రీ-ఇండక్షన్ ట్రైనింగ్‌కు పంపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వొకేషనల్ స్ట్రీమ్‌లో ఇంటర్ పూర్తిచేసిన అంకుర్ సహా కొంతమందిని ఆ తర్వాత అనర్హులుగా ప్రకటిస్తూ ఉద్యోగంలోకి తీసుకోలేదు. దీంతో బాధిత అభ్యర్థులంతా 1996లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యూనల్ ను ఆశ్రయించారు. అప్పట్లో దానిపై విచారణ జరిపిన ట్రిబ్యూనల్ వారిని ఉద్యోగంలోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ తపాలా శాఖ 2000 సంవత్సరంలో హైకోర్టును ఆశ్రయించింది. 17 ఏళ్ల తర్వాత పోస్టల్ డిపార్ట్‌మెంట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ట్రిబ్యూనల్ ఆదేశాలను సమర్థించింది. దీనిపై 2021లో రివ్యూ పిటిషన్ వేసినా దాన్ని కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. దీంతో తపాలా శాఖ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తపాలా శాఖ పిటిషన్‌ను కొట్టివేసింది. ఉద్యోగానికి దరఖాస్తుల స్వీకరణ సమయంలో వొకేషనల్ స్ట్రీమ్‌లో చదివినవారు అనర్హులని పోస్టల్ శాఖ స్పష్టంగా చెప్పలేదని కోర్టు గుర్తించింది. అంతేగాక, దరఖాస్తుల పరిశీలన సమయంలోనే ఆ అభ్యర్థులను రిజెక్ట్ చేయకుండా ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు తెలిపింది. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరేనాటికి పిటిషనర్లలో చాలా మంది తమ పోరాటాన్ని మధ్యలోనే ఆపేయగా ఒక్క అంకుర్ మాత్రమే పోరాడారు. ఈ క్రమంలోనే ఆయనను నెల రోజుల్లోగా పోస్టల్ అసిస్టెంట్‌గా నియమించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే, ఆయన జీతం బకాయిలు, సీనియార్టీని క్లెయిమ్ చేసుకోలేరని స్పష్టం చేసింది. ఈ ఉద్యోగానికి పదవీ విరమణ వయసు 60 ఏళ్లు కాగా ప్రస్తుతం ఆయన 50 ఏళ్లు దాటారు. అంటే ఆయనకు ఇంకా 10 ఏళ్ల కంటే తక్కువ సర్వీసే మిగిలి ఉంది. పింఛను పొందేందుకు అర్హత లభించే సర్వీసు ఆయనకు ఉండదు. అయితే రిటైర్మెంట్ ప్రయోజనాలకు ఆయనను అర్హుడిగా పరిగణించాలని కోర్టు ఆదేశించింది.

ఓటర్లకు ఉచితంగా జిలేబీ, పోహా

ఎంపీలో దుకాణదారుల సంఘం ప్రకటన

ఇండోర్ : మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలోని ప్రముఖ ఫుడ్ హబ్ '56 దుకాన్'లో ఉన్న షాపుల యజమానులు రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ముందుగా ఓటు వేసే వారికి పోహా, జిలేబీలతో కూడిన ఉచిత అల్పాహారం అందించాలని నిర్ణయించారు. ఓటింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంగా ఈ చర్య ఉంది. 230 మంది సభ్యులున్న ఎంపీ అసెంబ్లీకి నవంబరు 17న ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ ప్రారంభ సమయంలో ఎవరైనా ఓటు వేసిన వారికి వేలిపై చెరగని సిరా గుర్తును చూపిన తర్వాత ఉచితంగా పోహా, జిలేబీ అందిస్తామని దుకాణదారులు ప్రకటించారు. 56 దుకాన్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుంజన్ శర్మ శనివారం దీనిపై పీటీఐతో మాట్లాడుతూ 'పరిశుభ్రత విషయంలో ఇండోర్ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ఓటింగ్ పరంగా కూడా మా నగరం అగ్రస్థానంలో ఉండాలని మేము కోరుకుంటున్నాము. దీని కోసం, ఓటు వేసిన వారికి ఉచిత పోహా, జిలేబీ అందించాలని మేము నిర్ణయించుకున్నాము' అని వివరించారు. 'ఈ ఉచిత పంపిణీ ఓటింగ్ రోజున అంటే నవంబరు 17 ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటుంది. దీని తర్వాత, ప్రతి ఓటరుకు ఆ రోజంతా పోహా-జిలేబీ బిల్లుపై 10 శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తాము' అని శర్మ చెప్పారు. పోహా అనేది బియ్యంతో తయారు చేసిన ఒక ప్రసిద్ధ చిరుతిండి. అయితే జిలేబీ చక్కెరతో తయారు చేసిన రుచికరమైన తీపి వంటకం. భారత ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) 56 దుకాన్‌కు 'క్లీన్ స్ట్రీట్ ఫుడ్ హబ్' హోదాను ఇచ్చింది. ఎందుకంటే ఇక్కడ అవుట్‌లెట్‌లు నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయి. 2018 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇండోర్ పట్టణ ప్రాంతంలోని ఐదు స్థానాల్లో మొత్తం 14.72 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ 67 శాతం ఓటింగ్ నమోదయింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఐదు అసెంబ్లీ స్థానాల్లో మొత్తం 15.55 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారు.

ఆ రూ. 42 కోట్లు ఎక్కడివి?

- ఐటీ శాఖ స్వాధీనం చేసుకున్న మొత్తంపై భిన్న కథనాలు
- బీజేపీపై 40 శాతం కమీషన్ ఆరోపణలు
- తెలంగాణలో కాంగ్రెస్ ప్రచార నిధులు: బీజేపీ, జేడీఎస్ ఆరోపణ

బెంగళూరు : అధికార కాంగ్రెస్ పార్టీతో సంబంధాలున్న బెంగళూరు సివిల్ కాంట్రాక్టర్ కుమారుడు ఆర్.అంబికాపతి నివాసంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.42 కోట్లపై అనేక కథనాలు వెలువడుతున్నాయి. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సివిల్ కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమీషన్ వసూలు చేసిందని అంబికాపతి ఆరోపించారు. ఆయన బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. బీబీఎంపీలో సివిల్ నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు సంబంధించిన ఆస్తులపై ఐటీ అధికారులు గత రెండు రోజులుగా వరుస దాడులు నిర్వహిస్తున్నారు. అయితే బీజేపీ మాత్రం, స్వాధీనం చేసుకున్న ఈ నగదు, గత బీజేపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు అధికారులు రూ.650 కోట్లు విడుదల చేయడంతో కాంట్రాక్టర్లు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చెల్లించాల్సిన కమీషన్‌లో భాగమని పేర్కొంది. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి నిధులు సమకూర్చేందుకే స్వాధీనం చేసుకున్న ఈ నగదు అని పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోని అధికార భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) తో పాటు బీజేపీ ఆరోపించింది. తెలంగాణలో నవంబరు 30న ఎన్నికలు జరగనుండగా, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పార్టీ బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పోటీ పడుతోంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకారం, బీజేపీ ఎంఎల్‌సీ, అధికార ప్రతినిధి ఎన్.రవికుమార్ మాట్లాడుతూ 'ఒక కాంట్రాక్టర్ వద్ద దొరికిన రూ.42 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లింపుల 650 కోట్ల రూపాయల విడుదలకు కమీషన్. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే. శివకుమార్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి. నిధులపై సమగ్ర విచారణ జరగాలి' అని అన్నారు. అదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి, జనతాదళ్ (సెక్యులర్) నాయకుడు హెచ్‌డీ కుమారస్వామి కూడా బీజేపీ అభిప్రాయాన్నే ప్రతిధ్వనించారు. 'కొంతమంది కాంట్రాక్టర్లకు రూ.650 కోట్ల చెల్లింపులను విడుదల చేయడంతో నగదు దొరికింది. ఈ డబ్బు అక్రమమని తెలుస్తోంది. దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు, ముడుపుల శాతం ఎంత?' అని కుమారస్వామి శుక్రవారం సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. కాగా, కుమారస్వామి పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుంది. ఇదిలాఉండగా, ఆ డబ్బుతో కూడిన అట్టపెట్టెలను తెలంగాణకు తరలించేందుకు ఉన్నట్టు సమాచారం. నగదును స్వాధీనం చేసుకున్న అంబికాపతి ప్రస్తుతం నగరంలోని ఆర్‌టి నగర్ కాంగ్రెస్ కౌన్సిలర్‌గా ఉన్న అశ్వతమ్మ భర్త. ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న డీకే శివకుమార్‌తో విభేదించి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ నిరాకరించిన అఖండ శ్రీనివాసమూర్తికి అశ్వతమ్మ సోదరి కూడా. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లింపులు నిలిపివేయాలని ఈ ఏడాది ఆగస్టులో శివకుమార్ అన్నారు. అసలు పనికి రుజువు చూపకుండా బిల్లులు సమర్పించే ఎవరికీ తమ ప్రభుత్వం చెల్లించదని ఆయన అన్నారు. గత బీజేపీ ప్రభుత్వం నుంచి రూ.710 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. చెల్లింపుల విడుదల కోసం శివకుమార్ లంచం డిమాండ్ చేశారని ఆరోపిస్తూ కొందరు కాంట్రాక్టర్లు గవర్నర్ జోక్యాన్ని కూడా కోరారు. అయితే ఆ తర్వాత కాంట్రాక్టర్లు తమ ఆరోపణలను వెనక్కి తీసుకున్నారు. అయితే, బీజేపీ ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు చెల్లింపుల కోసం శివకుమార్ 'డీకేఎస్ పన్ను' అని బీజేపీ ఆరోపిస్తోంది. ఐటీ దాడులపై శివకుమార్ స్పందిస్తూ, అది 'రాజకీయ ప్రేరేపిత' చర్య అని అన్నారు.

'రాజకీయ ఉద్దేశం లేకుండా ఐటీ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోదు. జరుగుతున్నదంతా మాకు తెలుసు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇది జరుగుతోంది. ఇది చత్తీస్‌గఢ్‌లో కూడా జరుగుతోంది' అని అన్నారు. చెల్లింపుల విడుదలకు, స్వాధీనం చేసుకున్న లెక్కల్లో చూపని డబ్బుకు మధ్య ఉన్న సంబంధం గురించి ప్రత్యేకంగా అడిగినప్పుడు 'నాకు తెలియదు. వీధుల్లో మాట్లాడే వ్యక్తులపై నేను స్పందించాల్సిన అవసరం లేదు' అని బీజేపీ ఆరోపణలపై డీకే శివకుమార్ తెలిపారు.

18 వరకు టెల్ అవీవ్‌కు విమానాలు బంద్

ఎయిరిండియా

న్యూదిల్లీ: ఇజ్రాయెల్ - హమాస్ మధ్య పోరు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ దేశానికి వెళ్లే విమాన సర్వీసులను ఎయిరిండియా తాత్కాలికంగా నిలిపివేసిన చేసిన విషయం తెలిసిందే. ఈ విమానాల రద్దును మరికొన్ని రోజులు పొడిగించారు. ప్రయాణికులు, సిబ్బంది భద్రత దృష్ట్యా దిల్లీ - టెల్ అవీవ్ మధ్య రాకపోకలు సాగించే విమానాలను అక్టోబరు 18 వరకు నిలిపివేస్తున్నట్లు ఎయిరిండియా అధికారి శనివారం వెల్లడించారు. అయితే, అవసరాన్ని బట్టి ఇజ్రాయెల్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఛార్టెర్డ్ విమానాలను నడుపుతుందని ఆ అధికారి తెలిపారు. సాధారణంగా దిల్లీ - టెల్ అవీవ్ మధ్య సోమ, మంగళ, గురు, శని, ఆదివారాల్లో ఎయిరిండియా విమానాలు నడుపుతోంది. ఉద్రిక్తతల దృష్ట్యా అక్టోబరు 7 నుంచి ఈ సర్వీసులను నిలిపివేశారు. మరోవైపు, ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్ చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ అజయ్'ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటివరకు ప్రత్యేక విమానాల్లో దాదాపు 450 మంది భారతీయులు దిల్లీకి చేరుకున్నారు. ఇజ్రాయెల్‌లో దాదాపు 18వేల మంది భారతీయులు నివసిస్తున్నారు. వారిలో దాదాపు 14వేల మంది కేర్‌టేకర్లే. వీరితోపాటు విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, వజ్రాల వ్యాపారులు తదితరులున్నారు.

హంతకుడికి ఆశ్రయం ఇచ్చే వ్యక్తిలా ప్రవర్తిస్తున్నాడు

మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌పై సంజయ్ రౌత్ ధ్వజం

ముంబై : మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌పై శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ శనివారం ధ్వజమెత్తారు. ఇలాంటి నేరాలకు పాల్పడేలా ప్రోత్సహించడానికి హంతకుడికి ఆశ్రయం ఇచ్చే వ్యక్తిలా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. శివసేన తిరుగుబాటు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యంపై నార్వేకర్‌పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన ఒక రోజు తర్వాత ఆయన వ్యాఖ్య చేశారు. రౌత్ విలేకరులతో మాట్లాడుతూ 'ఇలాంటి నేరాలు మరిన్ని చేసేలా ప్రోత్సహించేందుకు హంతకుడికి శరణార్థి ఇచ్చినట్లుగా స్పీకర్ పని చేస్తున్నారు. ఆయనకు చట్టం తెలియదా?' అని ప్రశ్నించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం తీసుకున్న వైఖరిని ఎన్నడూ తీసుకోలేదని, స్పీకర్‌పై కఠినంగా ప్రస్తావిస్తుందని సేన (యూబీటీ) ఎంపీ అన్నారు. స్పీకర్, ముఖ్యమంత్రి (ఏక్‌నాథ్ షిండే), ఆయన ప్రభుత్వం మహారాష్ట్ర ప్రతిష్ఠను దిగజారుస్తున్నాయని ఆరోపించారు. సీఎం షిండే, ఆయనకు విధేయులైన శివసేన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌లపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యంపై శుక్రవారం సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ స్పీకర్‌పై కఠిన వ్యాఖ్యలు చేసింది.

మిజోరంలో కొత్త పొత్తులు

హెచ్‌పీసీఆర్‌తో ఎంఎన్‌ఎఫ్ అవగాహన

ఐజ్వాల్: ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో మిజోరంలో రాజకీయ పార్టీలు ఎత్తులు, పొత్తులపై దృష్టి కేంద్రీకరించాయి. హెచ్‌పీసీ పార్టీ చీలికవర్గం హమర్ పీపుల్స్ కన్వెన్షన్ (రీఫార్మేషన్-హెచ్‌పీసీ(ఆర్))తో పాలక మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్) శనివారం పొత్తు కుదుర్చుకుంది. మిజోరం అసెంబ్లీకి నవంబరు 7వ తేదీన ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. పొత్తు ఒప్పందంపై ఎంఎన్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి లాల్‌ముంతంగా ఫనాయ్, హెచ్‌పీసీ(ఆర్) ప్రధాన కార్యదర్శి హెచ్‌టీ ఉంగా సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం ఈ రెండు పార్టీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పనిచేస్తాయి. ఎంఎన్‌ఎఫ్‌కు హెచ్‌పీసీ(ఆర్) పూర్తి మద్దతిస్తుంది. హెచ్‌పీసీ(ఆర్) ఆధిపత్యం గల నియోజకవర్గాల్లో ఎంఎన్‌ఎఫ్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తుంది. ఎంఎన్‌ఎఫ్ తిరిగి అధికారం చేపడితే నాటి మిజోరం ప్రభుత్వం, పూర్వపు హమర్ పీపుల్స్ కన్వెన్షన్(డెమోక్రటిక్) మధ్య కుదిరిన మెమోరాండం ఆఫ్ సెటిల్‌మెంట్-2018 అమలుకు చర్యలు తీసుకుంటుంది. ఒప్పందం ప్రకారం తీవ్రవాదం కారణంగా ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు, హెచ్‌పీడీ(సీ) మాజీ నాయకులు, కార్యకర్తలకు ఉద్యోగాలు సహా పునరావాసం, ఇతర సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందిస్తుంది. సిన్లుంగ్ హిల్స్ కౌన్సిల్ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తుంది. వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయి. రొహ్రంగ నాయకత్వంలో గల మరో హెచ్‌పీసీ వర్గం ఆగస్టులో ప్రధాన ప్రతిపక్షం జోరం పీపుల్స్ మూవ్‌మెంట్(జేడ్‌పీఎం)తో పొత్తు కుదుర్చుకుంది. ఆ కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి.

బీజేపీ ఓటమిని పసిగట్టిన సీఎం చౌహాన్

కాంగ్రెస్

భోపాల్ : ఎన్నికల వాగ్దానాలపై పార్టీ నేతలు కమల్‌నాథ్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాను లక్ష్యంగా చేసుకున్న మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌పై కాంగ్రెస్ శనివారం విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి చరణ్ సింగ్ సప్రా ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అధికార బీజేపీని 'మునిగిపోతున్న ఓడ' అని అభివర్ణించారు. నవంబరు 17న కేంద్ర రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 230 స్థానాలకు గానూ 145 సీట్లకు పైగా కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. 'రాష్ట్రంలో మునిగిపోతున్న బీజేపీ ఓడను ప్రధాని మోదీ కూడా రక్షించలేకపోతున్నారు' అని సప్రా అన్నారు. బీజేపీ ఓటమి ఖాయమని చౌహాన్ నిరుత్సాహానికి గురయ్యారని, రాజకీయ ప్రమాణాలను మర్చిపోయి మూర్ఖపు ప్రకటనలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 'గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిన విషయాన్ని మర్చిపోయి వారికి వ్యతిరేకంగా చౌహాన్ మాట్లాడుతున్నాడు' అని ఏఐసీసీ అధికార ప్రతినిధి అన్నారు. విద్యార్థులకు ఉచిత విద్య, నగదు ప్రోత్సాహకాలపై పార్టీ వాగ్దానాలపై తప్పుడు ప్రకటనలు చేయడం ద్వారా కమల్‌నాథ్ గాంధీ కుటుంబాన్ని మోసం చేస్తున్నారని ఒక రోజు ముందు చౌహాన్ ఆరోపించారు. దీనికి ప్రియాంక గాంధీ దీటుగా స్పందిస్తూ, కాంగ్రెస్ చదువు, పిల్లల గురించి మాట్లాడుతుంటే ప్రజల దృష్టిని మళ్లించిన వారికి ఇంకేదో అర్థమైందని అన్నారు. 'నాథూరామ్ గాడ్సే ఆరాధకులు (మహాత్మా) గాంధీ, గాంధేయవాదులపై మాత్రమే నిందలు వేస్తారు. గాంధీజీని గాడ్సే హత్య చేశాడని దేశం మరచిపోదు' అని సప్రా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులం, మతం, తరగతులతో సంబంధం లేకుండా మధ్య ప్రదేశ్‌లోని ప్రతి బిడ్డకు స్కాలర్‌షిప్ పథకం కింద స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని ప్రియాంక గాంధీ వాద్రా చెప్పారు.

విజయమా లేక వీరస్వర్గమా?

మరాఠా కోటాకు 24 తుది గడువు: జరంగే



జల్నా: విద్య, ఉద్యోగాలలో మరాఠాలకు రిజర్వేషన్‌లపై మరాఠా రిజర్వేషన్ పోరాట నాయకుడు మనోజ్ జరంగే మహారాష్ట్ర ప్రభుత్వానికి తుది గడువు విధించారు. అక్టోబరు 24వ తేదీలోగా రిజర్వేషన్లు కల్పించడంపై నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని జరంగే శనివారం హెచ్చరించారు. మరాఠాలకు రిజర్వేషన్ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మహారాష్ట్రలో మరాఠాల రిజర్వేషన్ల అంశం కేంద్రబిందువుగా మారింది. అక్టోబరు 24 తర్వాత తన అంత్యక్రియలైనా జరగాలి లేదా రిజర్వేషన్లు ఇచ్చినందుకు విజయోత్సవాలైనా నిర్వహించాలని జరంగే కరాఖండిగా చెప్పారు. జల్నా జిల్లా అంతర్వలి సరతి గ్రామంలో శనివారం భారీ జనసందోహాన్ని ఉద్దేశించి జరంగే ప్రసంగించారు. ఓబీసీ కేటగిరీ కింద మరాఠీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జరంగే ఇంతకుముందు ఈ గ్రామంలోనే ఆమరణ దీక్ష చేశారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే తనను కలిసి మరాఠాలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని హామీ ఇవ్వడంతో సెప్టెంబరు 14న జరంగే దీక్ష విరమించారు. నాడు ఆయన 17 రోజులపాటు ఆమరణదీక్ష కొనసాగించారు. మరాఠీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకుగాను చర్యలు తీసుకోవడానికి శిండే ప్రభుత్వానికి ఆయన అప్పుడు 40 రోజుల డెడ్‌లైన్ విధించారు. రాష్ట్రవ్యాప్తంగా మరాఠాలకు కుంబీ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఓబీసీ కేటగిరీ కింద కుంబీలు రిజర్వేషన్లు పొందుతున్నారని తెలిపారు. 24వ తేదీ నాటికి తమ డిమాండ్‌ను ప్రభుత్వం నెరవేర్చకపోతే ఉద్యమం తీవ్రత పెంచుతామన్నారు. 22వ తేదీనే సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టంచేశారు. శాంతియుత నిరసనలు చేయాలని తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు. తమ ఆందోళనకు ఏడు కోట్ల రూపాయలు సేకరించినట్లు మంత్రి, ఎన్‌సీపీ నేత ఛగన్ భుజ్‌బల్ చేసిన ఆరోపణలపై జరంగే మండిపడ్డారు. మరాఠాలను కవ్వించేందుకు భుజ్‌బల్, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, న్యాయవాది గుర్నాథం సదావర్తే ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు.

విజింజం ఓడ రేవుతో గొప్ప అభివృద్ధి

- ఏటా 10 లక్షల కంటైనర్ల నిర్వహణ లక్ష్యం
- కేరళ సీఎం పినరయి విజయన్

న్యూదిల్లీ : విజింజంలోని అంతర్జాతీయ డీప్ వాటర్ బహుళ ప్రయోజన ఓడ రేవును రాష్ట్ర మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి గొప్ప మార్పుగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శనివారం అభివర్ణించారు. సింగపూర్‌ను అధిగమించి సంవత్సరానికి 10 లక్షల కంటైనర్లను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రారంభ నౌక 'జెన్ హువా 15' అక్టోబరు 15న విజింజం ఓడ రేవులో నిలిపి ఉంచడానికి సిద్ధంగా ఉందని పేర్కొంటూ ఆయన సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. కంటైనర్ రవాణా సామర్థ్యాలు, ప్రధాన షిప్పింగ్ మార్గాలకు సామీప్యత గురించి గొప్పగా చెబుతూ, ఇది కేరళ రాష్ట్ర మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి గొప్ప మార్పు అని ఆయన అన్నారు. 'సింగపూర్‌ను అధిగమించి ఏటా 10 లక్షల కంటైనర్‌లను నిర్వహించాలని విజింజం పోర్ట్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ అద్భుతమైన ప్రాజెక్టు పెట్టుబడులను ఆకర్షించడానికి, అనేక ఉద్యోగ అవకాశాలను సృష్టించడానికి సిద్ధంగా ఉంది. ఇది దేశం గర్వం, పురోగతికి మరింత దోహదం చేస్తుంది' అని సీఎం తన 'ఎక్స్' ఖాతాలో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఓడరేవుకు సంబంధించిన సంక్షిప్త వీడియోను కూడా విజయన్ ఈ సందర్భంగా పంచుకున్నారు. గురువారం ఓడ రేవుకు చేరుకున్న తొలి నౌక 'జెన్ హువా 15' కు అధికారికంగా స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో సీఎం సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. చైనా నుంచి క్రేన్‌లతో వచ్చిన ఓడకు టగ్ బోట్లు వాటర్ ద్వారా అభివాదం చేసి రూ.7,700 కోట్ల డీప్ వాటర్ అంతర్జాతీయ పోర్ట్‌లోకి తీసుకువెళ్లాయి. వచ్చే ఏడాది మే నాటికి ప్రారంభించాలని భావిస్తున్న ఓడ రేవుకు అక్టోబరు, నవంబరులో మరో మూడు నౌకలు రానున్నాయని కేరళ ప్రభుత్వం గత నెలలో తెలిపింది. బ్రేక్ వాటర్ నిర్మాణం కూడా 75 శాతం పూర్తయిందని ప్రభుత్వం తెలిపింది. విజింజం పోర్టును ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం నమూనాలో నిర్మిస్తున్నారు. అదానీ గ్రూప్ విజింజం ఓడరేవు అభివృద్ధిలో ప్రైవేట్ భాగస్వామి. ఇది ప్రపంచంలోని అతిపెద్ద ఓడరేవులలో ఒకటిగా అవతరిస్తుంది. 2019లో ప్రారంభించాల్సిన ఈ ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించిన అనేక సమస్యల కారణంగా ఆలస్యమైంది. ఓడ రేవు తమ జీవనోపాధిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని ఆరోపిస్తూ ఆ ప్రాంతంలోని మత్స్యకారులు ప్రాజెక్టును వ్యతిరేకించడంతో విజింజంలో హింసాత్మక నిరసనలూ చోటుచేసుకున్నాయి. ఓడ రేవు నిర్మాణం, నిర్వహణ చుట్టూ పర్యావరణ ఆందోళనలు కూడా ఉన్నాయి.

అదానీ అవకతవకలపై జేపీసీ విచారణ

- కాంగ్రెస్ పునరుద్ఘాటన
- ఆ గ్రూప్ విమానాశ్రయాల వ్యవహారంపై దర్యాప్తు బూటకం

న్యూదిల్లీ : ముంబైలోని అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన రెండు విమానాశ్రయాల ఖాతాలపై కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నివేదించిన దర్యాప్తును కాంగ్రెస్ శనివారం 'బూటకం' గా అభివర్ణించింది. అదానీ సమస్యపై జేపీసీ విచారణ కోసం తన డిమాం డ్‌ను పునరుద్ఘాటించింది. అమెరికా పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ 'అక్రమాలు' ఆరోపించిన తరువాత, వాటాల తారుమారు ఆరోపణలపై బిలియనీర్ గౌతమ్ అదానీ గ్రూప్ ఆర్థిక లావాదేవీలను ప్రతిపక్ష పార్టీ ప్రశ్నిస్తోంది. అయితే అదానీ గ్రూప్ హిండెన్‌బర్గ్ నివేదికలో చేసిన ఆరోపణలన్నింటినీ ఖండించింది. తమ వైపు నుంచి ఎటువంటి తప్పు జరగలేదని పేర్కొంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని గ్రూపునకు చెందిన రెండు విమానాశ్రయాల ఖాతాలపై కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దర్యాప్తు చేస్తోందని అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఉటంకిస్తూ ఒక మీడియా కథనాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఉదహరించారు. అదానీ గ్రూపు అక్రమాలు రోజురోజుకూ బయట పడుతుండటంతో ప్రధాని మోదీకి ఇష్టమైన వ్యాపార గ్రూప్‌పై చర్యలు తీసుకుంటున్నట్లు చూపించేందుకు ప్రభుత్వం పీఆర్ పద్ధతికి మారడం ద్వారా తన ప్రతిష్ఠను కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని రమేశ్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. నీతి ఆయోగ్, ఆర్థిక వ్యవహారాల శాఖ అభ్యంతరాలపై అదానీ గ్రూప్‌కు ఆరు విమానాశ్రయాల్లో ఆరు విమానాశ్రయాలు ఎలా ఇచ్చారనే దానిపై ప్రభుత్వం ఎప్పుడు దర్యాప్తు చేస్తోందని ఆయన ప్రశ్నించారు. అదానీ గ్రూపునకు విక్రయించడానికి ఇష్టపడని ముంబై విమానాశ్రయ యజమానులపై ఈడీ, సీబీఐ ఎలా దాడులు చేశాయనేది ఎప్పుడు దర్యాప్తు చేస్తుంది?. దేశంలోని రెండవ అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాన్ని ప్రధాని మోదీ అత్యంత సన్నిహితుడు తన అధీనంలోకి తీసుకున్న తర్వాత కేసు ఎలా స్తంభించిపోయింది?' అని కూడా జైరాం రమేశ్ ప్రశ్నించారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ మాత్రమే 'మోదానీ మెగా స్కామ్' వెనుక నిజాన్ని వెల్లడిస్తుందని అన్నారు.

నవరాత్రుల కోసం ప్రధాని గర్బా పాట

న్యూదిల్లీ : గత కొద్ది రోజులుగా తాను కొత్త గర్బా పాటను రాశానని, నవరాత్రుల సందర్భంగా దానిని ప్రజలతో పంచుకుంటానని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం చెప్పారు. సంవత్సరాల క్రితం తాను రాసిన మరో గర్బా పాటకు సంగీతపరంగా సహకరించిన కళాకారులు ధ్వని భానుషాలి, తనిష్క్ బాగ్చి, జస్ట్ మ్యూజిక్ బృందానికి ధన్యవాదాలని మోదీ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవం అక్టోబరు 15న ప్రారంభమవుతుంది. గర్బా అనేది గుజరాతీ నృత్యంలో ఒక రూపం. దీనిని సాధారణంగా తొమ్మిది రోజుల ఉత్సవాలలో ప్రదర్శిస్తారు. 'ఎక్స్' పై చిత్రీకరణను పోస్ట్ చేసిన భానుశాలికి ప్రతిస్పందనగా మోదీ ఈ పోస్ట్ చేశారు. 'ప్రియమైన నరేంద్ర మోదీ జీ, తనిష్క్ బాగ్చి, నేను మీరు రాసిన గర్బాను ఇష్టపడ్డాము. మేము సరికొత్త లయ, కూర్పుతో పాటను రూపొందించాలనుకుంటున్నాము. ఈ పాట, వీడియోకు జీవం పోయడానికి జస్ట్ మ్యూజిక్ మాకు సహాయపడింది' అని ఆమె పేర్కొంది.

ప్రగతిశీల విమర్శకుడు రాచపాళెం

అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ

అనంతపురం: అధ్యయనం, అవగాహన, స్పష్టమైన సామాజిక దృక్పథం గల ప్రగతిశీల విమర్శకుడు రాచపాళెం చంద్ర శేఖర్‌రెడ్డి అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రశంసించారు. రాచపాళెం కేవలం రాయలసీమ సాహిత్యానికే కాకుండా తెలుగు సాహిత్య విమర్శకు కేంద్రంగా నిలిచారని పేర్కొన్నారు. అభ్యుదయ ప్రగతిశీల సాహిత్య మార్గంలో ఐదున్నర దశాబ్దాలు నిరంతరం రచనలు చేస్తూ వస్తున్నారని తెలిపారు. అనంతపురం ప్రభుత్వ కళాశాలలోని డ్రామా హాలులో శనివారం సుప్రసిద్ధ సాహిత్య విమర్శకుడు, కవి, కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి పుస్తకాలు మన నవలలు (సాహిత్య విమర్శ), మన కథానికలు (సాహిత్య విమర్శ)తో పాటు విమర్శాపునర్నవం ప్రత్యేక సాహిత్య సంచిక ఆవిష్కరణ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, తెలుగు సాహిత్య విమర్శకు సంబంధించి రాయలసీమ నుంచి అనేక మంది గొప్పవారు వచ్చారనీ, వారి స్ఫూర్తి కొనసాగింపుగా రాచపాళెం ఉన్నారని చెప్పారు. మార్క్సిస్టు దృక్పదంతో రచనలు చేస్తున్న గొప్ప వ్యక్తి రాచపాళెం అన్నారు. సైన్స్, సాహిత్యం సమాజాన్ని ముందుకు నడిపిస్తాయని బలంగా నమ్మే వ్యక్తని చెప్పారు. మూడున్నర దశాబ్దాలుగా అరసం, అభ్యుదయ సాహిత్యంలో గొప్ప కృషిచేస్తున్న అభ్యుదయ సాహితీవేత్తనీ, అభ్యుదయ సాహిత్య విమర్శను కొనసాగించడంలో స్వయంగా ఆయన పాలుపంచుకోవడమేకాకుండా తన శిష్యులు, తెలిసిన వారిని ప్రభావితం చేస్తున్న వ్యక్తి రాచపాళెం అని పెనుగొండ కొనియాడారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ 'మన నవలలు' సాహిత్య విమర్శను జూలూరు ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యంలో కొడవటిగంటి కుటుంబరావు, కేవీ రమణారెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, రాచమల్లు రామచంద్రారెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి వంటి విమర్శకులు తెలుగు సాహిత్యాన్ని శక్తిమంతం చేసేందుకు సానబట్టారని చెప్పారు. రాచపాళెం పేరున జరుగుతున్న ఈ సభ విమర్శకు పునరుజ్జీవన వేదికగా నిలుస్తుందని, తెలుగు సాహిత్య విమర్శ మంచి రూపం తీసుకుంటుందన్నారు. రాచపాళెం 'గురజాడ తొలి కొత్త కథలపై విమర్శ' చేశారని, కవిత్వంపై మంచి విమర్శ రాశారని, రాయలసీమ బాంబుల సంస్కృతిపై మంచి కవిత్వం రాశారని, రాచపాళెం సాహిత్య విమర్శా కేంద్రంగా నిలవటంలో ఆయన 50 ఏళ్ల సుదీర్ఘ సాహిత్య కృషి ఉందని తెలిపారు. నిరంతర అధ్యయనం, ఆలోచనలతో రాచపాళెం మాదిరిగా విమర్శలు రాసేవారు రావాలని, విమర్శ రంగంలో వందల మంది రాచపాళెంల అవసరం ఉందన్నారు. విమర్శకునికి రాచపాళెంలాగా ఎక్స్ రే తీసే కళ్లు ఉండాలని, సాహిత్య విమర్శ ఎంత బాగుంటే తెలుగు సాహిత్యానికి అంత పురోగతి ఉంటుందని చెప్పారు. సాహిత్య విమర్శను బోధించడమే కాదు, తరగతి బయట ఎదురయ్యే సవాళ్లకు దీటుగా జవాబిచ్చే వ్యక్తిత్వాన్ని వాళ్లకు అందిస్తూ, సామాజిక ఉద్యమాలకు పునాదులయ్యే విలువలను, సాహిత్యసామగ్రిని విద్యార్థులకు అందజేసిన గురువు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అని అన్నారు.

దాసరి ఆదినారాయణ ఉద్దీపనాగీతంతో సభా కార్యక్రమం ప్రారంభమైంది. ఆచార్య రాచపాళెం 50 ఏళ్ల సాహిత్య జీవితకృషి 'విమర్శ పునర్నవం' ప్రత్యేక సంచికను ముఖ్యఅతిథి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. రాచపాళెం సాహిత్య కృషిపై 'విమర్శపునర్నవం' ప్రత్యేక సంచికను శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆచార్యులు కొలకలూరి మధుజ్యోతి పరిచయం చేశారు. విమర్శ పునర్నవం ప్రధాన సంపాదకుడు డా.కె.నాగేశ్వరాచారి నివేదికను సమర్పించారు. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణస్వామి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.యస్.రఘు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వరరావు, సుప్రసిద్ధ సాహిత్య సామాజిక విశ్లేషకులు తెలకపల్లి రవి, వై.గోపిరెడ్డి, డా.గేయానంద్, డా.ఏసీఆర్ దివాకర్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. 'మన నవలలు' సాహిత్య విమర్శను వరంగల్ తెలుగు అధ్యాపకుడు డా. వి.సంపత్ రెడ్డి పరిచయం చేశారు. ఈ పుస్తకాన్ని కె.చెంచురెడ్డి దంపతులకు అంకితమిచ్చారు. మన కథానికలు సాహిత్య విమర్శను వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డా. శాంతినారాయణ ఆవిష్కరించారు. తెలుగు అధ్యాపకుడు డా.బావికాటి రాఘవేంద్ర పరిచయం చేశారు. ఈ పుస్తకాన్ని మదనమోహన రెడ్డి దంపతులకు అంకితమిచ్చారు. మధ్యాహ్నం 'వర్తమాన తెలుగు సాహిత్య విమర్శ-వివిధ ధోరణులు' అంశంపై సదస్సు జరిగింది. అనంతపురం అరసం జిల్లా అధ్యక్షుడు బి.ఈశ్వర్ రెడ్డి ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ ప్రధాన ప్రసంగంతో ఈ చర్చా సదస్సు ఆసక్తికరంగా జరిగింది. తొలుత ప్రజా గాయకుడు దాసరి ఆదినారాయణ ఆలపించిన ఉద్దీపన గీతం అందరినీ ఆకట్టుకుంది. డాక్టర్ జూటూరు షరీఫ్ వందన సమర్పణ చేసిన ఈ సాహితీ కార్యక్రమంలో డాక్టర్ అనంత మాలతి, కటకం కృష్ణవేణి, మధుర శ్రీ, తోట నాగరాజు, గుంటి మురళీకృష్ణ, పండిట్ రియాజుద్దీన్ అహ్మద్, చెట్ల ఈరన్న, రామలింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనం అయోమయం

పోలీసుల కనుసన్నల్లో ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్): ప్రతిష్ఠాత్మక దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో కనకదుర్గమ్మ దర్శనం ఎలా అనే అయోమయం నెలకొంది. ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగే అవకాశం ఉందని, భద్రత పేరుతో పోలీసులు ఈసారి క్యూలైన్ల నుంచి అన్ని ఏర్పాట్లు తాము చెప్పినట్లే జరిగేలా వ్యవహరించారు. క్యూలైన్ సహా అనేక ఏర్పాట్ల పను లకు కానిస్టేబుళ్లను కేటాయించారు. ఒక్కమాటలో చెప్పాలంటే దుర్గగుడి ఇంజినీరింగ్ విభాగాన్ని ఉత్సవ విగ్రహంలా మార్చి పోలీసులే నేరుగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు చేయించడం గమనార్హం. ఉత్సవాలకు ముందు దుర్గగుడి ఈవోలను ప్రభుత్వం మార్పు చేయడమే ఇందుకు కారణమనే వాదన బలంగా వినిపిస్తోంది.

కొత్త నిర్ణయాలతో చిక్కులు తప్పేనా?

దసరా ఉత్సవాలకు దుర్గగుడి అధికారులు ఏర్పాట్లు చేయడం ఆనవాయితీ. ఈసారి పోలీసులే కొండ దిగువన క్యూ లైన్‌ల నుంచి అంతరాలయం వరకు ఎవరు ఎటు నుంచి రావాలి, ఎటు వెళ్లాలనేది నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల వర్షాలకు ఘాట్‌రోడ్డులో కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో భక్తుల భద్రత పేరుతో క్యూ లైన్ల ఏర్పాటులో మార్పులు చేశారు. అదే సమయంలో కొండ దిగువన మోడల్ గెస్ట్ వద్ద ఎటువంటి వాహ నాలు నిలపకూడదని పోలీసులు నిర్ణయించారు. కెనాల్ రోడ్డులో ఎటువంటి వాహ నాలను అనుమతించరు. వీఐపీలు, మీడియా, ఇతర ప్రముఖుల వాహనాలను భవానీపురం లోని భవానీ ఘాట్, పున్నమీ ఘాట్‌లలో తమ వాహనాలు నిలిపి దేవస్థానం ఏర్పాటు చేసిన వాహనాల్లో కొండపైకి చేరుకోవాలని చెబుతున్నారు. అయితే, వన్‌టౌన్ వైపు నుంచి వచ్చే వారు రాజీవ్‌గాంధీ పార్క్ వద్ద కనకదుర్గ ఫ్లై ఓవర్ ఎక్కి భవానీపురం వైపునకు చేరుకుని, అక్కడి నుంచి మళ్లీ వెనక్కి వచ్చి పున్నమీ, భవానీ ఘాట్‌లకు చేరుకుని తమ వాహనాలు నిలుపుకోవాలి. అక్కడి నుంచి దేవస్థానం ఏర్పాటు చేసిన వాహనాల్లో కొండపైకి చేరుకోవాల్సి ఉంటుంది. ఇంత ప్రయాసపడి దర్శనానికి వెళ్లడంపై భక్తులు ఎలా స్పందిస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

ఇంజినీరింగ్ విభాగం ఎక్కడ?

సాధారణంగా దసరా ఉత్సవాల్లో దుర్గగుడి ఇంజినీరింగ్ విభాగం క్యూ లైన్ల నుంచి అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఆయా పనులను కాంట్రాక్టర్‌కు కేటాయిం చడం, పనులు చేయించడం, పర్యవేక్షించడం అన్ని ఆ విభాగమే చూసేది. ఈ ఏడాది మాత్రం ఇంజినీరింగ్ విభాగం ఉత్సవ విగ్రహంలా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. క్యూ లైన్లు ఎటు ఏర్పాటు చేయాలి, ఎక్కడ దారి ఉండాలి, ఎక్కడ అత్యవసర దారి ఉండాలనే కీలక పనులతో పాటు క్యూ లైన్‌లోని ఇనుప మెష్‌కు తెల్ల వస్త్రం చుట్టించే పనిని కూడా పోలీసులే పర్యవేక్షిస్తు న్నారు. వారే నేరుగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు చేయిస్తున్నట్లు తెలిసింది. ఉత్సవాలకు పది రోజుల ముందే దేవస్థానం ఈవోగా ఉన్న భ్రమరాంబను బదిలీ చేయడం, ఆమె స్థానంలో నియమించిన వ్యక్తిని కూడా బాధ్యతలు స్వీకరించ కుండానే మార్పు చేయడంతో గందరగోళంగా మారింది. ప్రస్తుతం ఈవో కేఎస్ రామారావు ఉత్సవాల ప్రారంభోత్సవానికి మూడు రోజుల ముందుగానే బాధ్యతలు స్వీకరించడంతో ఏర్పాట్లపై పర్యవేక్షణ చేసే అవకాశం పెద్దగా లేకపోయింది. అయినా పాలకమండలి ఏం చేస్తుం దనేది కూడా చర్చనీయాంశంగా మారింది.

ఇక ప్రత్యక్ష యుద్ధమే

- విదేశీయుల తరలింపునకు ఈజిప్టు, అమెరికాతో ఇజ్రాయిల్ ఒప్పందం
- యూద దేశంతో సత్సంబంధాలపై సౌదీ వెనక్కి
- గాజాలో 1300 భవనాలు నేలమట్టం.. 2,215 మంది మృతి

జెరూసలేం: ఇజ్రాయిల్ భీకర దాడులతో గాజా గజగజ వణికిపోతోంది. ప్రత్యక్ష యుద్ధానికి సిద్ధమైన ఇజ్రాయిల్ దళాలు ఇప్పటికే ఉత్తర గాజాని వీడి దక్షిణ గాజాకు వెళ్లిపోవాలన్న ఆదేశాలు జారీచేశాయి. దీంతో పలస్తీనా ప్రజలు తమ ఇళు,, వాకిళ్లు వదిలి వలసబాట పట్టారు. ఇదే క్రమంలో గాజా నుంచి విదేశీయుల తరలింపునకు ఈజిప్టు, ఇజ్రాయిల్, అమెరికా దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. రఫా సరిహద్దు గుండా విదేశీయులను తమ దేశంలోకి అనుమతించేందుకు ఈజిప్టు అంగీకరించింది. విదేశీ పౌరులను తరలించే మార్గాల్లో దాడులకు పాల్పడబోమని ఇజ్రాయిల్ హామీ ఇచ్చింది. ఇందుకు హమాస్ కూడా అంగీకరిం చింది. ఖతార్ ఈ చర్చల్లో పాల్గొన్నట్లు ఈజిప్టు అధికారులు వెల్లడించారు. రాఫా క్రాసింగ్ పాయింట్ వద్ద సరిహద్దులను తెరవాలంటూ సూచనలు అందాయని ఓ అధికారి తెలిపారు. గాజాలోని విదేశీయుల సంఖ్యపై స్పష్టత రాలేదు. గాజాకు సాయాన్ని అందించే విషయమై ఇంకా చర్చలు జరుగుతున్నట్లు చెప్పారు. ఇజ్రాయిల్ దాడులతో పలస్తీనాలో ఇప్పటికే 4.23 లక్షల మంది నిరాశ్రయులైనట్లు ఐక్యరాజ్య సమితి (ఐరాస) తెలిపింది. ఇప్పటివరకు 2,215 మంది పలస్తీనా ప్రజలు మరణించినట్లు హమాస్ నియంత్రణలోని ఆరోగ్య శాఖ వెల్లడిం చింది. దక్షిణ గాజాకు వెళ్లిపోయేందుకు వీలుగా ప్రత్యేక తరలింపు కారిడార్లు ఉన్నట్లు ఇజ్రాయిల్ సైన్యం పేర్కొంది. తాజా పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా గాజాతో తమ సరిహద్దు వద్ద ఈజిప్టు తాత్కాలిక అడ్డుగోడలను ఏర్పాటు చేసుకుంది. అరబ్ దేశమైన సౌదీ అరేబియా... ఇజ్రాయిల్‌తో సత్సంబంధాలు ఏర్పరుచుకోవడానికి ఉద్దేశించిన ఒప్పంద చర్చలను నిలిపివేయాలని నిర్ణయించిందని, దీని గురించి అమెరికా అధికారులకు సమాచారం ఇచ్చిందని తెలిసింది. అరబ్ లీగ్‌లో శక్తిమంత దేశాల్లో సౌదీ అరేబియా ఒకటిగా ఉంది.

తాజా పరిణామాల దృష్ట్యా ఇతర ముస్లిం దేశాలూ సౌదీ బాట పట్టే అవకాశం ఉంది. సాధారణంగా పలస్తీనా సమస్య.. అరబ్ దేశాలకు ఓ భావోద్వేగమైన అంశం. అందుకే మెజారిటీ ముస్లిం దేశాలు ఇజ్రాయిల్ విషయంలో కఠిన వైఖరినే అవలంబిస్తాయి. ఆ దేశ సార్వభౌమత్వాన్ని అధికారికంగా గుర్తించడానికి తిరస్కరిస్తూ వచ్చాయి. యూదు దేశంతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల పలస్తీనా ప్రజల హక్కులను కాలరాయడమే అవుతుందని ఇరాన్ అభిప్రాయపడింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇజ్రాయిల్‌తో సంబంధాలపై సౌదీ వెనక్కి తగ్గడం గమనార్హం. అలాగే హింస నివారణ, సాయం అందించడంపై ఈజిప్టు, టర్కీ నేతలు చర్చలు జరిపారు. రాఫా సరిహద్దును తాత్కాలిక తెరిచేం దుకు ఇజ్రాయిల్, ఈజిప్టు, ఖతార్‌తో అమెరికా చర్చించింది. రాఫా సరిహద్దు వద్ద తాత్కాలిక 'బ్లాస్ట్ వాల్స్'ను ఈజిప్టు తమ వైపున ఏర్పాటు చేసింది. జపాన్ తమ పౌరులను ఎయిర్‌లిఫ్ట్ చేసేందుకు మూడు సైనిక విమానాలను తూర్పు ఆఫ్రికాలోని దిజిబౌటి విమానాశ్రయంలో సిద్ధంగా ఉంచింది.

సరైన సమయంలో యుద్ధంలోకి... ఇజ్రాయిల్‌కు ఉత్తరాన ఉన్న లెబనాన్‌లో షియా వర్గానికి చెందిన హిజ్బులా సంస్థకు ఇరాన్ మద్దతు ఉంది. సరైన సమయం రాగానే హమాస్‌కు మద్దతుగా యుద్ధంలోకి దిగడానికి సన్నద్ధంగా ఉన్నామని హిజ్బుల్లా డిప్యూటీ చీఫ్ నయీమ్ ఓసెమ్ ప్రకటించారు. లెబనాన్‌లోని బీరుట్‌లో హమాస్‌కు మద్దతుగా జరిగిన ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పోరాడవద్దని తమపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతోందన్నారు. వాటికి తలొగ్గబోమని, సరైన సమయంలో పలస్తీనాకు అండగా నిలుస్తామని చెప్పారు. 'అగ్ర దేశాలు, అరబ్ దేశాలు, ఐక్య రాజ్య సమితి ప్రతినిధులు మనల్ని ఈ యుద్ధంలో హమాస్ మద్దతుగా పోరాడవద్దని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒత్తిడి చేస్తున్నాయి. సరైన సమయంలో రంగంలోకి దిగుతాం' అని అన్నారు. అయితే హిజ్బుల్లా వద్ద లక్షకుపైగా రాకెట్లు ఉన్నాయని ఇజ్రాయిల్ నిఘావర్గాలు అంచనా వేశాయి. స్వల్పలక్ష్యాలను ఛేదించే క్షిపణులు కూడా ఉన్నాయి. హమాస్‌తో పోలిస్తే హిజ్బులా సంస్థ బలంగా ఉండటమే కాకుండా దీనికి ఆర్థికంగా, ఆయుధ పరంగానూ ఇరాన్ మద్దతిస్తోంది. స్వతంత్ర పలస్తీనా ఏర్పాటే ఈ సంస్థ లక్ష్యం. గతంలో హమాస్, హిజ్బుల్లాపై ఇజ్రాయిల్ దాడులు చేసింది కానీ వాటిని నిర్మూలించలేకపోయింది. రానున్న కాలంలో హిజ్బుల్లాతో తలపడితే ఎలాంటి వ్యూహాలను ఇజ్రాయిల్ సైన్యం ఎలా అమలుచేస్తుందన్న అంశం ఆసక్తికరంగా మారింది.

ఆరు గంటల్లోగా వెళ్లిపోండి... గాజాను వీడేందుకు పలస్తీనా ప్రజలకు ఆరు గంటల సమయాన్ని ఇజ్రాయిల్ సైన్యం ఇచ్చింది. దశాబ్దాల్లో జరగని విధంగా ప్రత్యక్ష యుద్ధం గాజాలో జరగబోతోందని హెచ్చరించింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఎవ్వరూ తిరిగి రావద్దని పలస్తీనా ప్రజలకు తేల్చిచెప్పింది. 'మీ ఇళ్లను వదిలి వెళ్లిపోండి. మేము మళ్లీ చెప్పేంత వరకు తిరిగి రావద్దు. ఎన్నడూ లేని విధంగా భీకర దాడులకు ఇజ్రాయిల్ పూనుకుంది. ఇజ్రాయిల్‌పై ఉగ్రవాద సంస్థలు యుద్ధాన్ని మొదలు పెట్టాయి. ఇప్పుడు గాజా నగరం యుద్ధభూమిగా మారింది. తక్షణమే దక్షిణ గాజావాదీకి వెళ్లిపోండి. గాజా నగరం లోని శిబిరాలన్నీ కూడా ఖాళీ చేయాల్సిందే. ఎవరూ భద్రతా కంచె వద్దకు వెళ్లవద్దు. మళ్లీ చెబుతున్నాం. ఇది మీరు మీ కుటుంబాల రక్షణ కోసమే. కంచె వద్దకు ఎవరైనా వచ్చారంటే మరణం తప్పదు. గాజా స్ట్రిప్ నుంచి వెళ్లిపోండి' అంటూ ఐడీఎఫ్ హెచ్చరికలు చేసింది.

జీవన్మరణ స్థితి

20 లక్షల మందికి ముప్పు: ఐరాస

జెనీవా: తాగునీటి కొరతతో గాజాలోని 20 లక్షల మందికి పైగా ప్రజలకు జీవన్మరణ పరిస్థితి నెలకొందని ఐక్యరాజ్య సమితి సహాయ సంస్థ (యూఎన్ఆర్‌డబ్ల్యూఏ) శనివారం పేర్కొంది. 12 గంటల్లో కొన్ని వేల మంది తరలిపోయారని తెలిపింది. నీటి ఎద్దడి నెలకొంటోందని ఆందోళన వ్యక్తంచేసింది. రక్షిత తాగు నీరు కోసం ఇంధనం అత్యవసరమని యూఎన్ఆర్‌డబ్ల్యూఏ కమిషనర్-జనరల్ ఫిలిప్ లజ్జారిని అన్నారు. గాజా వాటర్ ప్లాంట్, పబ్లిక్ వాటార్ నెట్వర్కులు పనిచేయడం లేదన్నారు. విద్యుత్ లేక చిమ్మచీకటిలో గాజా ప్రజలు గడుపుతున్నారు. ఆహారం, నిత్యావసరాల సరఫరా నిలిచి పోగా నీళ్లు కూడా లభించిన పరిస్థితి గాజాలో ఉన్నట్లు ఐరాస వెల్లడిం చింది. ఇది తీవ్రమైన మానవతా సంక్షోభానికి దారితీస్తుందని హెచ్చరిం చింది. ఆసుపత్రులపై దాడి చేయడం అంతర్జాతీయ చట్టానికి విరుద్ధమని తేల్చి చెప్పింది. ఐరాస మానవహక్కుల హైకమిషనర్ (ఓహెచ్‌సీహెచ్ఆర్) అధికార ప్రతినిధి 'ఆండ్రోలూ' వార్తాసంస్థతో మాట్లాడుతూ ఇజ్రాయిల్ తీరును దుయ్యబట్టారు.

టీమిండియా ఆల్‌రౌండ్ షో

- ప్రపంచకప్‌లో పాక్‌పై ఘన విజయం
- రోహిత్ ధనాధన్ ఇన్నింగ్స్
- అర్ధసెంచరీతో అలరించిన శ్రేయాస్
- రాణించిన బౌలర్లు

అహ్మదాబాద్: ప్రపంచకప్‌లో మహాసంగ్రామం అనుకున్న దాయాదుల పోరు సాదాసీదాగా ముగిసింది. ఇక్కడి నరేంద్రమోదీ స్టేడియంలో శనివారం భారత్-పాక్ మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లో టీమిండియా7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. కేవలం 30.3 ఓవర్లలో 192 పరుగుల విజయలక్ష్యాన్ని ఊదేసింది. తద్వారా ప్రపంచకప్‌లో పాక్‌పై తన అజేయ రికార్డును పదిలపర్చుకుంది. లీగ్‌పోరులో టీమిండియా హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. ఇంతకుముందు ఆస్ట్రేలియా, అఫ్గానిస్తాన్‌పై టీమిండియా గెలుపొందిన సంగతి తెలిసిందే. మరో పక్క రెండు విజయాలతో ఊపుమీదున్న పాకిస్తాన్ తొలి ఓటమి చవి చూసింది. ఈ మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో రాణించిన రోహిత్ సేన పూర్తి ఆధిపత్యం కనబర్చింది. రోహిత్ ధనాధన్ ఇన్నింగ్స్‌కు తోడు మిడిల్డార్‌లో శ్రేయాస్ సమయోచిత ఇన్నింగ్స్ తోడవడంతో పాక్ విసిరిన 192 పరుగుల విజయ లక్ష్యం చిన్నబోయింది. టీమిండియా ఓపెనర్లు రోహిత్, శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ప్రారంభించగా... నాలుగు ఫోర్లు కొట్టి ఊపుమీదున్నట్లు కనిపించిన గిల్ షాహిన్ అఫ్రిదీ బౌలింగ్‌లో షాబాద్‌ఖాన్ క్యాచ్ పట్టడంతో వెనుదిరిగాడు. దీంతో 21 పరుగులకు టీమిండియా వికెట్ కోల్పోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ ఓవైపు ఆచితూచి ఆడగా... మరోవైపు కెప్టెన్ రోహిత్ శర్మ సిక్సులు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. 10వ ఓవర్‌లో 18బంతుల్లో 16 పరుగులు చేసిన కోహ్లీ హసన్ అలీ బౌలింగ్‌లో నవాజ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికి జట్టు స్కోరు 79/2. ఈ దశలో శ్రేయాస్ అయ్యర్ అండతో చెలరేగిన రోహిత్ అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. మరో పక్క అడపాదడపా ఫోర్లు కొడుతూ శ్రేయాస్ మరో మారు నిలకడైన ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 80కి పైగా పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈదశలో సెంచరీ వైపు దూసుకెళుతున్న రోహిత్... 86 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అఫ్రిదీ బౌలింగ్‌లో ఇఫ్తిఖార్‌కు క్యాచ్ ఇచ్చాడు. కేవలం 65బంతుల్లో 86 పరుగులు చేసిన రోహిత్ ఆరు భారీ సిక్సర్లు, ఆరు ఫోర్లు కొట్టి అభిమానులను అలరించాడు. రోహిత్ ఔట్ అయ్యేసరికి 156/3. అనంతరం శ్రేయాస్ అయ్యర్ (62 బంతుల్లో 53), కేఎల్ రాహుల్ (29 బంతుల్లో 19 పరుగులు) ఆడుతూ పాడుతూ జట్టును విజయ తీరాలకు చేర్చారు. కేవలం 30.3 ఓవర్లలోనే టీమిండియా మూడు వికెట్లకు 192 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. పాక్ బౌలర్లలో షాహీన్ అఫ్రిదీ 2 వికెట్లు, హసన్ అలీకి ఒక వికెట్ దక్కింది. 7ఓవర్లలో కేవలం 19పరుగులు ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టిన జస్ప్రీత్ బూమ్రా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ జట్టు నిర్ణీత 42.5 ఓవరల్లో 191 పరుగులు చేసి ఆలౌట్ అయింది. కెప్టెన్ బాబర్ అజామ్(58 బంతుల్లో 50; 7×4) హై స్కోరర్‌గా నిలిచాడు. మహ్మ ద్ రిజ్వాన్(69 బంతుల్లో 49; 7×4), ఇమామ్ ఉల్ హక్(38 బంతుల్లో 36; 6×4), అబ్దుల్లా షాహిక్(24 బంతుల్లో 20; 3×4) పరుగులు చేశారు. సౌద్ షకీల్(6), ఇఫ్తీఖర్ అహ్మద్(4), షాదబ్ ఖాన్(2), మహ్మ ద్ నవాజ్(4), హసన్ అలీ(12) నామమాత్రపు స్కోర్ చేశారు. భారత బౌలర్లలో బుమ్రా, సిరాజ్, హార్దిక్ పాండ్య, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా రెండేసి వికెట్ల చొప్పున పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో భారత పేసర్లు, స్పిన్నర్లు రాణించారు. కీలక సమయాల్లో వికెట్లు తీయగలగడంతో పాక్‌ను స్వల్ప స్కోరుకే పరిమితం చేయగలిగారు.

వారిద్దరే...

తొలుత పాక్ ఓపెనర్లు శుభారంభం అందించారు. మొదటి వికెట్‌కు అబ్దుల్లా షెఫీక్ -ఇమామ్ కలిసి 41 పరుగులు జోడించారు. అయితే వీరి జోడీని సిరాజ్ విడగొట్టాడు. అబ్దుల్లా తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే.. ఇమామ్‌ను అద్భుతమైన బంతితో హార్దిక్ బోల్తా కొట్టించాడు. అనంతరం టీమిండియాపై మంచి రికార్డు కలిగిన పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ అజామ్-వికెట్ కీపర్ రిజ్వాన్ క్రీజ్‌లో పాతుకుపోయేందుకు ప్రయతించారు. మూడో వికెట్‌కు 82 పరుగులను నమోదు చేసి జట్టును పటిష్ట స్థితిలోనే నిలిపారు. దీంతో 29 ఓవర్లకు పాక్ 150/2 స్కోరుతో నిలిచింది. అయితే ఈ జోడీని మళ్లీ సిరాజే విడగొట్టాడు. అర్ధ శతకం సాధించిన బాబర్‌ను బౌల్డ్ చేసి పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత పాక్ ఏ దశలోనూ కోలుకోలేదు.

37 పరుగుల వ్యవధిలో ఎనిమిది వికెట్లు

బాబర్ అజామ్‌ను ఔట్ చేసిన తర్వా త భారత బౌలర్లు మరింత రెచ్చిపోయారు. ఒకే ఓవర్లో షకీల్, ఇఫ్తికార్‌ను కుల్దీప్ ఔట్ చేశాడు. షకీల్ ఎల్బీడబ్ల్యూ అయ్యా డు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా రివ్యూ తీసుకున్న టీమిండియాకు అనుకూలంగా ఫలితం దక్కింది. అనంతరం మరికాసేపటికే కీలకమైన రిజ్వాన్‌ను, షాదాబ్‌ను తన వరుస ఓవర్లలో బుమ్రా కూడా క్లీన్‌బౌల్డ్ చేసేశాడు. కేవలం ఐదు ఓవర్ల వ్యవధిలో ఐదు వికెట్లను కోల్పో యి పాక్ చతికిలపడే దిశగా వెళ్లిపోయింది. మహమ్మద్ నవాజ్ (4), హసన్ అలీ (12) క్రీజులో నిలదొక్కుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో 29.3 ఓవర్లకు 154/2 స్కోరుతో ఉన్న పాకిస్థాన్ జట్టు 42.5 ఓవర్లలో 191 పరుగులకే ఆలౌట్ అయింది.కేవలం 37 పరుగుల వ్యవధిలో చివరి ఎనిమిది వికెట్లను కోల్పోయింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.